


జెండా ఊపి సింహగిరి ప్రదక్షిణను ప్రారంభిస్తున్న దేవస్థానం అనువంశిక ధర్మకర్త, మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు

సింహగిరి ప్రదక్షిణకు లక్షలాది మంది రాక

భక్త జనసంద్రం

- పోటెత్తిన సింహాచలం
- ఉత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించిన దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- భక్తులకు స్వచ్ఛంద సంస్థల సేవలు

విశాఖపట్నం, సింహాచలం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):

ఓం నమో నారసింహ. పాహిమాం... పాహిమాం...పాహి గోవిందా...గోవింద!!. అంటూ భక్తుల నామస్మరణతో శనివారం సింహగిరి పులకించిపోయింది. గిరి ప్రదక్షి ణకు తరలివచ్చిన భక్తజనంతో సింహాచలం, అడవివరం ప్రాంతం జనసంద్రమైంది. ఉదయం వేలల్లో మొదలైన భక్తుల సంఖ్య సాయంత్రానికి లక్షలకు చేరుకుంది. ప్రదక్షిణ మార్గం జన ప్రవాహంతో కిక్కిరిసింది. అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది.

వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరి చుట్టూ శనివారం లక్షలాది మంది భక్తులు ప్రదక్షిణలు చేశారు. జిల్లా కలెక్టర్, దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించిన సమయం కంటే ముందుగానే వేలాది మంది భక్తులు శనివారం ఉదయం ఎనిమిది గంటలకే సింహాచలం తొలిపావంచావద్దకు చేరుకుని కొబ్బరికాయలు కొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త, మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు అధికారులు నిర్ణయించిన సమయానికి అంటే సాయంత్రం నాలుగు గంటలకు కొండదిగువన తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. పుష్పతేరులోని స్వామివారికి అర్చక స్వాములు పూజలు చేసి అశోక్‌గజపతిరాజుకు తీర్థ ప్రసాదాలను ... మిగతా 6వ పేజీలో


అడవివరం వద్ద గిరి ప్రదక్షిణలో భారీగా పాల్గొన్న భక్తజనం


సింహాచలంలో తొలిపావంచా వద్ద భక్తుల పూజలు

మరిన్ని ఫొటోలు, వార్తలు I పేజీలో


హనుమంతవాక జంక్షన్ సమీపంలో భక్త జనసందోహం

గిరి పెదచ్చన చేత్తే మంచి జరుగుతాది



కట్టమున్న పెతిసారి సామిని మదిలో అనుకుని కోరుకుంతే ఆ కట్టాలన్నీ తీరిపోతన్నాయి. అందుకే సామి గిరి పెదచ్చనకు ఏటా వత్తుంటాను. ఏదైనా మనసులో అనుకుని గిరి పెదచ్చన చేత్తే అవి తప్పక తీరుతాయి. నాకైతే చానా వరకు సామి దయతో మేలే జరిగినాది. అందుకే పెతేటా వత్తంటాను. ఇప్పుడు నాతోని ఎందరో వచ్చినారు. కుర్రలు ఉన్నారు. గిరి పెదచ్చన ఎందుకు చేత్తన్నారో తెలీదు గానీ..చేత్తే మాత్రము మంచి జరుగుతాది. బలముగా కోరీసుకుని భత్తితో పెదచ్చన పూరితి చేత్తే మాత్రము నెరవేరుతాదని బలముగా చెప్పగలను.

- జి.బంగారమ్మ, గోవిందపురం

ఎంతో పున్నెమొత్తాది



సిమ్మాద్రప్పన్న మయిమగ లోడు. కోరిన కోరికలు తీరుత్తాడు. గిరి పెదచ్చన చేత్తే ఎంతో పున్నెమొత్తాది. ఆరేళ్ల నించి కెమం తప్పకన్న వత్తన్నాను. పెదచ్చన తరవాత సామిని దర్శనం చేసుకున్న తరవాత ఎంతో గొప్ప ఆనందమేత్తాది. సామిని మనసుపూర్తిగా కొలిత్తే కట్టాలన్నీ తీరుత్తాడు. బత్తితో నడిచేత్తే ఏమీ తెలీదు. చిన్నా, పెద్దా అంతా ఉసారుగా నడిచేత్తన్నారు. ఒంట్లో ఓపికున్నంత కాలమూ వత్తాను. మా చుట్టాలు, మేము కలిసి వచ్చినాము. పెతేడాది మా ఊరు నుంచి వత్తున్న బత్తులు ఎక్కువైనారు. పిల్లకాయలు కూడా ఎక్కువ మందే వచ్చినారు.

- జట్టి దేముళ్లు, పార్వతీపురం

కేజీహెచ్‌లో ఫ్లోరోసెంట్ లైన్స్

- రోగుల సౌకర్యార్థం కలర్ లైన్స్ ఏర్పాటు
- ఆస్పత్రి గేటు నుంచి ఓపీ/వార్డు/విభాగాలకు వెళ్లే మార్గాలను సూచిస్తూ ఏడు రకాల రంగులతో ప్రత్యేక లైన్స్
- అధికారుల ఏర్పాట్లు



విశాఖపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రి కేజీహెచ్‌కు ప్రతిరోజూ వందలాది మంది వైద్య సేవలు పొందేందుకు వస్తుంటారు. వీరిలో సగం మంది నిరక్షరాస్యులు ఉంటుంటారు. అటువంటి వారంతా వైద్య సేవలు పొందేందుకు ఇబ్బందిపడుతుంటారు. ఎక్కడికి వెళ్లాలో, ఎలా వెళ్లాలో... తెలియక సతమతమవుతుంటారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి అధికారులు వినూత్న ఆలోచన చేస్తున్నారు. రోగి ఎక్కడికి వెళితే ఏ వైద్య సేవలు అందుతాయో తెలియజేసేలా 'ఫ్లోరోసెంట్ లైన్స్' వేయించాలనుకుంటున్నారు. యూకే, స్విట్జర్లాండ్ వంటి దేశాల్లోని ఆస్పత్రుల్లో ఈ ఫ్లోరోసెంట్ లైన్స్ ఇప్పటికే వినియోగిస్తున్నారు. అటువంటి విధానాన్నే ఇక్కడ అందుబాటులోకి తీసుకురానున్నారు. ఏడు రకాల రంగులతో కూడిన లైన్స్‌ను ఆస్పత్రిలో ప్రధాన గేటు వద్ద నుంచి ఆయా విభాగాలు, ఓపీలు, వార్డుల వరకు వేయనున్నారు. ఒక్కో లైన్ ఏ వార్డు/ఓపీ కేంద్రానికి తీసుకువెళుతుందన్న విషయాన్ని ఆస్పత్రి గేటు వద్ద ప్రదర్శించనున్నారు. ఆ గేటు వద్దకు రోగి వచ్చి అక్కడ ఉండే సిబ్బంది సహకారంతో లైన్ వెంబడి వెళ్లడం ద్వారా తాము సేవలు పొందాలనుకునే చోటకు చేరుకోవచ్చు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నాలుగు రోజుల కిందట ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ నిర్వహించిన సమీక్షలో ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. ఇందుకు మంత్రి కూడా సుముఖతను ... మిగతా 6వ పేజీలో

రసకందాయంలో గ్రేటర్ రాజకీయం

తెలుగుదేశం, వైసీపీ వ్యూహప్రతివ్యూహాలు

- మేయర్ పదవి దక్కించుకునేందుకు టీడీపీ పావులు
- పార్టీలో చేరేందుకు సిద్ధమైన 20 మంది వైసీపీ కార్పొరేటర్లకు గ్రీన్‌సిగ్నల్?
- నేడు చేరికలు





(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) రాజకీయం రసకందాయకంగా మారింది. సాధారణ ఎన్నికల్లో కూటమి ఏకపక్ష విజయం సాధించిన తరువాత మేయర్ పీఠంపై టీడీపీ దృష్టిసారించింది. కౌన్సిల్‌లో బలం పెంచుకోవడం ద్వారా స్టాండింగ్ కమిటీతోపాటు మేయర్ పదవిని దక్కించుకోవాలని భావిస్తోంది. మరోవైపు తమ కార్పొరేటర్లు పార్టీ మారకుండా అడ్డుకుని, తద్వారా మేయర్ పీఠాన్ని కాపాడుకోవాలని వైసీపీ యత్నిస్తోంది. ఈ క్రమంలో ఇటు కూటమి నేతలు, అటు వైసీపీ నేతలు తమ పార్టీల కార్పొరేటర్లతో వరుస సమావేశాలు జరుపుతుండడం సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది. అయితే వైసీపీ కార్పొరేటర్లు 20 మందికిపైగా టీడీపీలో చేరిపోవాలని ఇప్పటికే నిర్ణయించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.

- ఈ నెలాఖరున స్టాండింగ్ కమిటీ ఎన్నిక నిర్వహించేందుకు కసరత్తు
- ఈ విషయం తెలిసి...మేయర్ ఛాంబర్‌లో వైసీపీ కార్పొరేటర్లతో మాజీ మంత్రి గుడివాడ అమర్ సమావేశం
- 28 మంది కార్పొరేటర్లు డుమ్మా
- హాజరైనవారిలోనూ అసంతృప్తి
- అధికారంలో ఉండగా కనీసం పట్టించుకోలేదని ఆగ్రహం

జీవీఎంసీకి 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అత్యధిక వార్డులను గెలుచుకోవడంతో మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. మొత్తం 98 వార్డులు ఉండగా 58 వార్డులను వైసీపీ, 30 వార్డులను టీడీపీ, మూడు వార్డులను జనసేన, నాలుగు వార్డులను ఇండిపెండెంట్లు, సీపీఐ, సీపీఎం, బీజేపీ ఒక్కొక్క వార్డు గెలుచుకున్నాయి. మేయర్‌గా గొలగాని హరివెంకటకుమారిని వైసీపీ అధిష్ఠానం ఎంపిక చేసింది. అనంతరం టీడీపీ నుంచి గెలిచిన ముగ్గురు, ఇండిపెండెంట్‌లుగా గెలిచిన నలుగురు కార్పొరేటర్లు వైసీపీకి మద్దతు ప్రకటించారు. దీంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం 65కి పెరిగింది. 21వ వార్డు కార్పొరేటర్‌గా గెలిచిన వంశీకృష్ణ శ్రీనివాస్ ఎమ్మెల్సీగా ఎన్నికవడంతో కార్పొరేటర్ పదవికి రాజీనామా చేయగా, ఆ వార్డుకు ఇప్పటికీ ఎన్నిక జరగకపోవడంతో ఖాళీగానే ఉండిపోయింది. ఇండిపెండెంట్‌లుగా గెలిచి వైసీపీకి మద్దతు ప్రకటించిన ఇద్దరు కార్పొరేటర్లు సాధారణ ఎన్నికలకు ముందు జనసేనలో చేరిపోగా, మరొక ఇండిపెండెంట్ కార్పొరేటర్, వైసీపీ నుంచి 29వ వార్డు కార్పొరేటర్‌గా గెలిచిన ఉరుకూటి నారాయణరావు టీడీపీలో చేరారు. దీంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం 60కి తగ్గింది. ఇదిలావుండగా ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏకపక్షంగా విజయం సాధించాయి. జీవీఎంసీ పరిధిలో ఒక్క నియోజకవర్గంలో కూడా వైసీపీ విజయం సాధించకపోవడంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో నిస్తేజం ఆవహించింది. మరోవైపు సాధారణ ఎన్నికల్లో సాధించిన విజయం కూటమి పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఉత్తేజం నింపింది. ఈ క్రమంలో ప్రభుత్వ ప్రాధాన్యాల ప్రకారం నగరంలో అభివృద్ధి జరగాలంటే జీవీఎంసీపై పట్టు ఉండాలని భావిస్తున్న కూటమి నేతలు మేయర్ పదవిని కూడా దక్కించుకోవాలని నిర్ణయానికి వచ్చారు. అయితే అందుకు కనీసం 59 మంది సభ్యుల బలం అవసరం కావడంతో వైసీపీ నుంచి కూటమి పార్టీల్లోకి చేరేందుకు ఆసక్తి ఉన్నవారిని గుర్తించే పనిలో పడ్డారు. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోగానే ఆ పార్టీకి చెందిన కొంతమంది కార్పొరేటర్లు స్వచ్ఛందంగా టీడీపీలో చేరతామంటూ ... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీ కమిషనర్‌గా సంపత్‌కుమార్



విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్‌గా పి.సంపత్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన సాయికాంత్‌వర్మకు ఇటీవల టిడ్కో ఎండీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆ పోస్టులో ఇప్పటి వరకూ ఎవరినీ నియమించలేదు. ఇన్‌చార్జి కమిషనర్‌గా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరీంధిర ప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు. అయితే శనివారం రాష్ట్రవ్యాపంగా 61 మంది ఐఏఎస్‌లను బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్.టి.ఆర్.జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.సంపత్‌కుమార్‌ను జీవీఎంసీ కమిషనర్‌గా నియమించింది. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంపత్‌కుమార్ గతంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీగా, మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఓఎస్‌డీగా పనిచేశారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా విశ్వనాథన్



విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.విశ్వనాథన్‌ను వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా నియమిస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన విశ్వనాథన్‌ను గత వైసీపీ ప్రభుత్వం జీవీఎంసీ అడిషనల్ కమిషనర్‌గా నియమించింది. ఇదిలావుండగా వీఎంఆర్‌డీఏ కమిషనర్ పోస్టు గత రెండేళ్లుగా ఖాళీగా ఉంది. అప్పటి కలెక్టర్ ఎ.మల్లికార్జునకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన వెళ్లిపోయిన తరువాత జాయింట్ కమిషనర్‌గా ఉన్న రవీంద్రకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు విశ్వనాథన్‌ను పూర్తిస్థాయిలో కమిషనర్‌గా నియమించారు.

జీసీసీ ఎండీగా కల్పనాకుమారి



విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా ఉన్న గిరిజన సహకార సంస్థ (జీసీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా కల్పనాకుమారిని ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఉన్న ఎండీ సురేష్‌కుమార్‌ను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. 2019 బ్యాచ్‌కు చెందిన కల్పనాకుమారి 2021లో విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్-2 (హౌసింగ్)గా పనిచేశారు. జిల్లాల విభజన తరువాత అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. అనంతరం పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణిగా వెళ్లిన ఆమెను కొద్దికాలం క్రితం ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కల్పనకుమారిని జీసీసీ ఎండీగా నియమించింది. ఆమె భర్త మయూర్ అశోక్ విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి తులసీ దళార్చన

పూర్ణామార్కెట్, జూలై 20: కనకమహాలక్ష్మికి తులసీదళార్చన సేవలను శనివారం నిర్వహించారు. అమ్మవారి విగ్రహం వద్ద తులసీ దళాలతో అర్చకులు ఉభయదాతల చేత పూజలు జరిపించారు.

సింహగిరి ప్రదక్షిణలో అడుగడుగునా భక్తి భావం

» స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం, పండ్లు పంపిణీ

సీతమ్మధార, జూలై 20: సీతమ్మధార నృసింహ స్వామి స్మరణతో మారుమోగింది. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు సీతమ్మధార ప్రధాన రహదారిలో వెళ్తూ ఇక్కడి వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సీఎంఆర్ ఏర్పాటు చేసిన వరహాలక్ష్మీనృసింహ స్వామికి పూజలు చేశారు. కూడలిలో భక్తులకు వైద్య శిబిరం, పలువురు తాగునీరు, మజ్జిగ, పులిహోర, దద్దోజనం, ఇతర ఆహార పదార్థాలను స్వచ్ఛందంగా పంపిణీ చేశారు. సీతమ్మధార సాయిబాబాభజనమండలి భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గిరిప్రదక్షిణకు వచ్చిన భక్తులతో నరసింహనగర్, పోర్టు సాలిగ్రామపురం, కైలాసపురం తదితర ప్రాంతాలు కిటకిటలాడాయి. వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు దారిపొడవునా, ఫ్రూట్స్ ప్రసాదం, తాగునీరు, బాదం పాలు, టిఫిన్, పులిహోర అందించారు. ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ భక్తులకు బాదం పాలు పంపిణీ చేశారు. నరసింహనగర్‌లో లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ అధినేత డాక్టర్ రామ్‌కుమార్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

మద్రిపాలెం: సింహాద్రి అప్పన్న ప్రచార సమాఖ్య ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ సమీపంలో భక్తులకు బిస్కెట్లు, పాలు, టీతోపాటు నొప్పుల నివారణ మందులను పంపిణీ చేశారు. భక్తులు కూర్చొని సేదతీరేందుకు కుర్చీలుఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక వేత్త ఎంవీరాజశేఖర్, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, ప్రచార సమాఖ్య వ్యవస్థాపకులు సనపల నారాయణస్వామి, సభ్యులు పొన్నాడ రాంబాబు, సనపల ధనంజయస్వామి తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు ప్రసాదం అందచేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మురళీనగర్: మాధవధార రోడ్డులో వైసీపీ మహిళా ఉపాధ్యక్షురాలు పి.రమణికుమారి అధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు, తాగునీరు అందించారు. మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీలవద్ద మానవసేవే మాధవసేవ అసోసియేషన్, ఎన్‌జీజీఓస్ కాలనీ సంక్షేమసంఘం, మాధవధార ఉడాకాలనీ సంక్షేమ సంఘం సహా 48ఏ మెయిన్ రోడ్డులో వ్యాపారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రసాదాలు, పాలు, మజ్జిగ అందజేశారు.

సీతమ్మధార: గ్రేటర్ విశాఖ 14వ వార్డు సీతమ్మధార పాపా హోమ్ ఎదురుగా సింహాచలం గిరి ప్రదక్షిణలో పాల్గొన భక్తులకు విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రసాదం, తాగునీరు పంపిణీ చేశారు. కూటమినేతలు పాల్గొన్నారు

కందిపప్పు, బియ్యం స్టాల్స్ తనిఖీ

అక్కయ్యపాలెం, జూలై 20: గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో ప్రభుత్వం ఏ ర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం స్టాల్ ను జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి (డీఎస్‌వో) జి.సూర్యప్రకాశ్ శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఇప్పటి వరకూ ఎంత మంది వినియోగదారులకు కందిపప్పు, బియ్యం విక్రయించారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ స్టాల్ వ్యాపారి ఎవరి వివరాలు సేకరించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తనకు సమాచారమివ్వాలని ఆర్ఐ మురళీకృష్ణను ఆదేశించారు. డీఎస్‌వోతో పాటు రైతుబజారు సహాయకుడు ఆర్.సత్యనారాయణ, స్టాల్ అధినేత చంద్రశేఖర్ ఉన్నారు.

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు, టమాటా వి క్రయాలను జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారి షేక్ యాసిన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'ముట్నూరి'కి మహతి నాదనిధి బిరుదు ప్రదానం



ప్రముఖ గాయని జలజాక్షిని సత్కరిస్తున్న దృశ్యం

సీతంపేట, జూలై 20: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కార్తికేయ కళాక్షేత్ర సంస్థ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సంగీత విద్వన్మణి మల్లాప్రగడ జోగులాంబ జ్ఞాపకార్థం వారి శిష్యులు, కుటుంబ సభ్యులు, నిర్వాహకులు సంయుక్తంగా ప్రముఖ గాయకురాలు ముట్నూరి జలజాక్షిని మహతి నాద నిధి బిరుదుతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏఐఆర్ విశ్రాంత స్టేషన్ డైరెక్టర్ కాకరపర్తి సత్యనారాయణ, బీవీకే కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీఎస్ఎన్ మూర్తి గురుపౌర్ణమి విశిష్టత వివరించారు. అనంతరం ప్రముఖ వాగ్గేయకారుడు మంగళపల్లి బాలమురళీకృష్ణ రచనలతో డాక్టర్ నిష్టల కృష్ణవేణి వీణావాదనం తో ఆహూతులను అలరింపజేశారు. వి.అరుణ, ఎం.ఏడుకొండలు, హనుమంతరావులు వీణ, మృదంగంతో సహకరించారు.

సీఎంఆర్ ఆధ్వర్యంలో ప్రసాదాల వితరణ



ప్రసాదం పంపిణీ చేస్తున్న సీఎంఆర్ నిర్వాహకులు

మద్దిలపాలెం: గిరి ప్రదక్షిణ సందర్భంగా సీతమ్మధార వెంకటేశ్వర ఆలయం వద్ద శనివారం సీఎంఆర్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు. సీఎంఆర్ చైర్మన్ మావూరి వెంకటరమణ, డైరెక్టర్లు మావూరి వెంకటపద్మావతి, మావూరి హారిక భక్తులకు చక్కెర పొంగలి, బిస్కెట్ ప్యాకెట్లు, పండ్లు, టీ, బాదం పాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీవరహా లక్ష్మీనరసింహ స్వామి ప్రతిమను ప్రతిష్ఠించి చందనం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సీఎంఆర్ జనరల్ మేనేజర్ నూలు లింగమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవం

సిరిపురం, జూలై 20: దేశంలోనే 2వ అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్.. బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవం సిరిపురం కూడలిలోని చిల్డ్రన్స్ ఎరినా ఆడిటోరియంలో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బ్యాంక్ విశాఖపట్నం రీజియన్ రీజనల్ మేనేజర్ పి. ఎం.పదాన్ మాట్లాడారు. బ్యాంక్ 116 ఏళ్ల పూర్తి చేసుకుని 117వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందన్నారు. బ్యాంక్ స్థాపించిన నాటి నుంచి ఖాతాదారుల ఆదరణను చూరగొని దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంక్‌గా నిలిచిందన్నారు. బ్యాంక్ అందరి అవసరాలకు తగ్గట్టు అన్ని



ప్రసంగిస్తున్న రీజియన్ మేనేజర్ పదాన్

రకాల రుణాలను అందిస్తుందని పేర్కొన్నారు. మరింత మెరుగైన సేవలందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ రీజనల్ ఆఫీస్, ఇతర బ్రాంచీలలో రక్తదాన శిబిరాలు, ఇతర సామాజిక కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ముఖ్యఅతిథిగా ఎల్ఐజీ చీఫ్ రీజనల్ మేనేజర్ శారదాప్రసాద్ పాల్గొన్నారు. పలువురు ఖాతాదారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి డీఆర్ఎం సతీషాసాలుంకే, బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు, చీఫ్ మేనేజర్లు, నగరంలోని వివిధ బ్రాంచీల మేనేజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

24న లైమ్ లైట్స్ అవార్డుల ప్రదానం

అక్కయ్యపాలెం, జూలై 20: ఈవెంట్ మేనేజర్ల అసోసియేషన్ (ఈమా) విశాఖ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన లైమ్ లైట్స్ అవార్డుల ప్రదానోత్సవం మధురవాడలోని వీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు సందీప్ కుమార్, షరీఫ్ ఖాన్ తెలిపారు. నరసింహనగర్‌లోని తమైరా స్కిన్ క్లినిక్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ వే డుకల్లో భాగంగా ప్రతిభావంతమైన ఈవెంట్ మేనేజర్లకు, కళాకారులకు, ఈవెంట్ రంగంలో వేర్వేరు శాఖలోని ప్రతిభావంతులకు అవార్డుల ప్రదానం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన స్పాన్సర్ తమైరా స్కిన్, బ్యూటీ క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి స్వరూప్, ఈమా ఆర్గనైజింగ్ సెక్రటరీ జీఎస్‌రాజు, జాయింట్ సెక్రటరీ సంతోష్ కుమార్, కార్యవర్గం సభ్యుడు జగదీష్, ఆశా పట్నాయక్ పాల్గొన్నారు.

రసాయనిక శాస్త్రంలో అనిల్‌కుమార్ ప్రథమ ర్యాంక్



అనిల్‌కుమార్

మహారాణిపేట, జూలై 20: ఆంధ్ర ప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ (ఏపీ ఆర్‌సెట్-24)లో బూసి అనిల్ కుమార్‌కు రసాయనిక శాస్త్ర విభాగంలో మొదటి ర్యాంక్ వచ్చింది. విశాఖకు చెందిన అనిల్ కుమార్ ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలో అధ్యాపకుడు డాక్టర్ మామిడి గోపి వద్ద శిక్షణ పొందారు. అతని సూచనలు సలహాలతో ఈ ర్యాంక్ సాధించినట్టు అనిల్‌కుమార్ తెలిపారు.

ప్రజల గుణపాఠం నుంచైనా పాఠాలు నేర్వరా?

» జగన్‌పై మాజీ మంత్రి గంటా ఫైర్

డాబాగార్డెన్స్, జూలై 20: వైసీపీ పాలనపై విసుగు చెందిన ప్రజల చరిత్ర ఎరుగని తీర్పునిచ్చినా ఆ పార్టీ అధినేత అర్థరహిత విమర్శలు మానుకోలేదని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసినా ఆయన గుణపాఠం నేర్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఇంకా రెండు నెలలైనా కాలేదని గుర్తు చేశారు. ఇంతలోనే ప్రజా తీర్పునకు కలత చెంది మొన్నటి వరకు హిమాలయాలకు వెళ్లిపోతానన్న వారు ఇప్పుడు రాష్ట్రపతి పాలన పెట్టాలని అడుగుతుండడంతో శోచనీయమని అన్నారు. మీ ఆత్మగా వ్యవహరిస్తున్న ఎంపీ మధ్యంతర ఎన్నికలు పెడితే మళ్లీ తమ పార్టీ అధికారంలోకి వస్తుందని అంటున్నారన్నారు. ఇలా తలో రకమైన వ్యాఖ్యలు చూస్తే మీ మానసిక పరిస్థితిని ఎలా అర్థం చేసుకోవాలో తెలియడంలేదన్నారు. రాష్ట్రంలోని అరాచకాలపై ఈనెల 24న ఢిల్లీలో ధర్నా చేస్తానంటున్న మీ మాటలు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్టున్నాయని అనిపించడంలేదా.. అని గంటా ప్రశ్నించారు. కరోనా సమయంలో మాస్కు అడిగిన పాపానికి విశాఖలో దళిత డాక్టర్ సుధాకర్‌ను చనిపోయే వరకు వేధించారన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ అనంతబాబు దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేశారన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే మీరు చేసిన పాపాలు, పాతకాలకు అంతేలేదన్నారు.

వరద నీటి ముంపు సమస్య పరిష్కరించాలి

» ఎమ్మెల్యే వంశీకృష్ణ

జగదాంబ కూడలి, జూలై 20: వన్‌టౌన్ పరిధిలో వరదనీటి ముంపు ప్రాంతాల సమస్య పరిష్కరించాలని అధికారులు ఎమ్మె ల్యే వంశీ కృష్ణ ఆదేశించారు. శనివారం గ్రేటర్ 39 వార్డులోని చిలకపేట ప్రాంతంలో కాలువలు, అండర్ డ్రైన్లు రోడ్లపై పొంగిపొర్లడంతోపాటు నీరు ఇళ్లలోకి చేరడంతో నివాసితులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.ఈ సందర్భంగా వారి సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వర్షం వస్తే కాలువలు పొంగి మురుగునీరంతా ఇళ్లలోకి చేరుతుందని చిలకపేట, లక్ష్మీటాకీస్ ఏరియా ప్రజలు దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే పాతపోస్టాఫీసు నుంచి లక్ష్మీటాకీస్ వరకు అండర్ డ్రైన్లు, కాలువల నిర్మాణంలో లోపాలను పరిశీలించారు.

కాలువల్లో పూడిక, చెత్త పేరుకుపోవడంతో తలెత్తుతున్న ఇబ్బం దులు స్థానికులు వివరించారు. మురుగునీరు కుళాయిల్లో కలసి తాగు నీరు కలుషితమవుతోందని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు.



చిలకపేట ఏరియాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

కిడ్నీ మార్పిడి పేరిట మోసం కేసులో నిందితుడి అరెస్టు

సీతంపేట, జూలై 20: కిడ్నీ మార్పిడి పేరిట రూ.10 లక్షలు వసూలు చేసి మోసగించిన కేసులో నిందితుడైన ఓ ఆస్పత్రిలోని అసిస్టెంట్ కో ఆర్డినేటర్ అనిల్‌ను ద్వారకా స్టేషన్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..పెందుర్తికి చెందిన సత్యనారాయణ గోపి, శారద లక్ష్మి దంపతులు. శారద లక్ష్మి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ స్థితిలో కిడ్నీ మార్చుకుంటే ప్రాణానికి హాని అని వైద్యులు తెలిపారు. దీంతో సత్యనారాయణ గోపి సీతమ్మధారలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి వచ్చి నెఫ్రాలజిస్టును సంప్రదించారు. అనంతరం ఆ వైద్యురాలి సూచనపై కిడ్నీ కోసం తన అసిస్టెంట్ కో ఆర్డినేటర్ అనిల్‌ను సంప్రదించారు. కిడ్నీ ఏర్పాటుతోపాటు వైద్య ఖర్చులతో కలిపి రూ. 27 లక్షలు అవుతుందని అనిల్ తెలిపాడు. ఈ ఒప్పందం మేరకు సత్యనారాయణ రూ.10 లక్షలు అనిల్‌కు ఇచ్చాడు. అనంతరం అనిల్ కిడ్నీ సమకూర్చకుండా దాటవేస్తూ వచ్చారు. ఇంతలో 2022లో సత్యనారాయణ గోపి జీవన్‌ధాన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో కిడ్నీ అందుబాటులో రావడంతో నగరంలోని ఓ ఆస్పత్రి శారద లక్ష్మికి వైద్యం చేయించాడు. అనంతరం సీతమ్మధారంలోని ఆస్పత్రిలోని వైదురాలు, ఆమె అసిస్టెంట్ అనిల్‌ను కలిసి తాను చెల్లించిన రూ. 10 లక్షలు ఇవ్వాలని కోరాడు. వారు నిరాకరించడంతో మోసపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్ రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేశారు. నగర పోలీసు కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విచారణ చేపట్టింది. ఈ క్రమంలో కిడ్నీ కోసం రూ. 10 లక్షలు తీసుకున్న అనిల్‌ను ద్వారకా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసును పలు కోణాల్లో ప్రత్యేక బృందం విచారణ చేపడుతోంది. మరి కొద్దిరోజులు ఈ నేరంలో పాలుపంచుకున్న వారందరిని అరెస్టు చేయనున్నట్లు సమాచారం.



అరెస్టు చేసిన అనిల్ (ఫైల్)

భక్త జనసంద్రం

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. అనంతరం ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలాపనలు, పండితుల వేద మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తితో కలిసి జెండాను ఊపి సింహగిరి ప్రదక్షిణకు అశోక్‌గజపతిరాజు లాంఛనంగా శ్రీకారం చుట్టారు. తేరుకు ముందుభాగాన దేవస్థానం అధికారులు ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సింహాచలం తొలి పావంచా వద్ద ప్రారంభమైన పుష్పతేరు (పూల రథం) పాత అడివివరం, హనుమంతువాక, జాతీయ రహదారి నుంచి మద్దిలపాలెం, గురుద్వారా, మురళీనగర్ కూడలి, ఎన్‌ఏడీ, గోపాలపట్నం బంక్, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం తొలిపావంచాకు చేరుకుంది. పూలరథాన్ని లక్షలాది మంది భక్తులు అనుసరించారు. ఉత్సవంలో పాల్గొనేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మాత్రమే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు. ముందుగా రూపొందించి ప్రణాళికల ప్రకారం దేవస్థానం అధికారులు తొలిపావంచా వద్ద ఏర్పాటుచేసిన 80 ఇనుప గడ్డర్లపై భక్తులు లక్షల సంఖ్యలో కొబ్బరికాయలను కొట్టారు. వాటిని పోగుచేసుకునేందుకు కాంట్రాక్టర్ ప్రత్యేక వాహనాలను, పనివార్లను వినియోగించారు. కొంతమంది భక్తులు సింహగిరి ప్రదక్షిణను ముగించుకుని పలువురు భక్తులు రాత్రి తొమ్మిది గంటలకే తిరిగి తొలిపావంచాకు చేరుకున్నారు.

భక్తులకు స్వచ్ఛంద సంస్థల సేవలు

తొలి పావంచా మొదలుకొని పాత అడివివరం, హనుమంతువాక, హెచ్‌బీ కాలనీ మీదుగా గోపాలపట్నం వరకూ భక్తులు నడిచే మార్గాల్లో సేవాసంస్థలు శిబిరాలు ఏర్పాటు చేసి అల్పాహారం, మజ్జిగ, బాదంపాలు, టీ, కాఫీలు, తాగునీరు సరఫరా చేశాయి. అలసిపోయిన భక్తుల కాళ్లకు సత్యసాయి సేవా సంస్థల సిబ్బంది సుమారుగా వంద మంది ప్రత్యేకంగా తయారుచేసిన నూనెతో మర్దనా చేసి సాంత్వన చేకూర్చారు. మానవ సేవే..మాధవ సేవ అనే మాటలను పూర్తిగా విశ్వసించి భక్తులకు సేవలు అందించారు.

రసకందాయంలో గ్రేటర్ రాజకీయం

... 5వ పేజీ తరువాయి

ప్రతిపాదన పెట్టారు. ఇలా 25 మందికిపైగా కార్పొరేటర్లు వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. కానీ వారిలో వివాదాస్పదమైనవారు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు, గతంలో పార్టీ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐదుగురిని పార్టీలో చేర్చుకునేందుకు టీ డీపీ నేతలు తిరస్కరించినట్టు తెలిసింది. ఈ మేరకు శుక్రవారం ఒక హోటల్‌లో టీడీపీ నేతలు, కార్పొరేటర్లు సమావేశమై ఈ అంశంపై ఏకాభిప్రాయం వ్యక్తంచేసినట్టు తెలిసింది. పార్టీలో చేరేందుకు ఆసక్తిగా ఉన్నవారిలో 20 మంది కార్పొరేటర్లను ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు సమక్షంలో పార్టీలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని టీడీపీ నేతలు చెబుతున్నారు.

కార్పొరేటర్లను కాపాడుకునే ప్రయత్నాల్లో వైసీపీ నేతలు

పార్టీ కార్పొరేటర్లు కొందరు టీడీపీలో చేరిపోవాలని నిర్ణయించుకోవడంతో వారిని కాపాడుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అధ్యక్షతన మేయర్ ఛాంబర్‌లో కార్పొరేటర్లతో ఆ పార్టీ నేతలు శనివారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సమావేశానికి 30 మంది కార్పొరేటర్లు మాత్రమే హాజరుకాగా 30 మంది గైర్హాజరవ్వడం ఆ పార్టీ నేతలను అవాక్కయ్యేలా చేసింది. సమావేశానికి హాజరైన 30 మందిలో పది మంది కార్పొరేటర్లు ఆ పార్టీ నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తినట్టు సమాచారం. పార్టీలో కనీస మర్యాద ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఇంతకాలం కార్పొరేటర్లను పట్టించుకోకుండా ఇప్పుడు మేయర్ పదవిని కాపాడుకోవడానికి పార్టీలోనే ఉండాలంటూ ఎలా చెబుతారంటూ మాజీ మంత్రి అమర్‌నాథ్‌ను నిలదీసినట్టు సమాచారం. సమావేశం రసాభాసగా మారడంతో చివరకు 'మీ ఇష్టం మరి. మేం చెప్పాల్సింది చెప్పాం' అని పార్టీ నేతలంతా చేతులెత్తేసినట్టు తెలిసింది.

నెలాఖరులోగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ పదవీకాలం ఈనెల 27తో ముగుస్తుంది. కొత్తకమిటీని ఎన్నుకోవాల్సి ఉంది. వైసీపీకి చెందిన 20 మందికిపైగా కార్పొరేటర్లు టీడీపీలో చేరాలని నిర్ణయించడంతో టీడీపీ బలం 48కి చేరుతుంది. జనసేన, బీజేపీని కలుపుకుంటే 54కి పెరుగుతుంది. స్టాండింగ్ కమిటీలోని పది మంది సభ్యులను 97 మంది కార్పొరేటర్లు ఎన్నుకోవాల్సి ఉంటుంది. కూటమికి 54 మంది కార్పొరేటర్ల బలం ఉండడంతో పది స్థానాలను కూటమి అభ్యర్థులే గెలుచుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ల చేరికలు పూర్తికాగానే ఈ నెలాఖరులోపే స్టాండింగ్ కమిటీ ఎన్నిక నిర్వహించనున్నారు. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత వచ్చే నెల మూడున కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. దీని కోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే కనీసం నాలుగేళ్ల పదవీకాలం పూర్తవ్వాలనే నిబంధన ఉంది. ప్రస్తుతం అమలులో ఉన్న మునిసిపల్ చట్టాన్ని సవరణ చేస్తే తప్ప మేయర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు వీల్లేదు. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో మునిసిపల్ చట్టాన్ని సవరిస్తే వెంటనే ప్రస్తుత మేయర్‌ను పదవి నుంచి దింపి ఆ పదవిని తాము కైవసం చేసుకోవాలని టీడీపీ నేతలు భావిస్తున్నారు.

కేజీహెచ్‌లో ఫ్లోరోసెంట్ లైన్స్

... 5వ పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. ఏఏ రంగులు ఏయే వార్డులు, ఓపీలు, విభాగాలను ఏర్పాటు చేయాలన్న దానిపై ఆస్పత్రి అధికారులు ప్రస్తుతం సమా లోచనలు చేస్తున్నారు. గిరి ప్రదక్షిణ తరువాత కలెక్టర్ అనుమతితో ఫ్లోరోసెంట్ లైన్స్‌ను వేసే పనిని ప్రారంభిస్తా మని సూపరింటెండెంట్ శివానంద వెల్లడించారు.

ఏడుచోట్ల హెల్ప్ డెస్క్‌లు

ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎదురవుతున్న ఇబ్బందులు దృష్ట్యా ఎంపీ, ఎమ్మెల్యేల సూచన మేరకు ప్రాంగణంలో ఏడుచోట్ల హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటుచేయాలని అధికా రులు నిర్ణయించారు. ఒక్కో హెల్ప్ డెస్క్ వద్ద ఒక సహాయకుడిని అందుబాటులో ఉంచనున్నారు. వీరు ఉదయం నుంచి సాయంత్రం వరకూ రోగులకు కావలసిన సమాచారాన్ని, సహకారాన్ని అందిస్తారు. ఈ హెల్ప్ డెస్క్‌లను రాజేంద్ర ప్రసాద్ వార్డు, భవనగర్ వార్డు, క్యాజువాలిటీ, సీఎస్‌ఆర్ బ్లాక్, ఇన్‌గేట్, మందులు ఇచ్చే కౌంటర్, సూపరింటెండెంట్ కార్యాలయం బయట ఏర్పాటు చేయనున్నారు. రోగులకు అవసరమైన సమాచారాన్ని అందించి సకాలంలో వైద్య సేవలు పొందేలా చేసేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

'రెల్లి సంక్షేమ సంఘం సత్తా చాటుతాం'

మహారాణిపేట, జూలై 20: రెల్లి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రలో భారీ సమావేశం నిర్వహించి సత్తా చాటుతామని జాతీయ రెల్లికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు భూపతి అప్పారావు అన్నారు. శనివారం స్థానికంగా ఓ సమావేశ మందిరంలో రెల్లి కుల సంక్షేమ సంఘం యువతీ యువకులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభు త్వాలు రెల్లి కులస్తుల జనాభాను శూన్యంగా పరిగణించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో తమ సత్తా చాటేందుకు ఉత్తరాంధ్రలో భారీ సమావేశం నిర్వహించి ప్రభుత్వాలకు తమ ఉనికి తెలియజేస్తామన్నారు. రాష్ట్రంలో సఫాయి కర్మచారి ఉద్యోగాలు 48 ఖాళీగా ఉన్నాయని తెలిపారు. విశాఖ జిల్లా సఫాయి కర్మచారి సంఘం అధ్యక్షుడిగా బంగారి సింహాచలంను నియమించారు. రిటైర్డ్ ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ వద్దాది అప్పల రాజు , కస్తూరి వెంకట రావు, మాదుగుల సత్యనారాయణ, చొక్కాకుల రాంబాబు బంగారు రవిశంకర్, వై. శ్రీనివాస్‌రావు, టి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

25 వరకు ఐటీఐ దరఖాస్తు గడువు

కంచరపాలెం, జూలై 20 : జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ఈనెల 24వ తేదీతో ముగియనున్నది. ఈ మేరకు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన వారు సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో తమ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకుని తగిన రసీదును పొందాలన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఈనెల 25వ తేదీ వరకు గడువు ఉందన్నారు. అభ్యర్థి ఏ ఐటీఐలో చేరదలచుకుంటే ఆన్‌లైన్‌లో సదరు ఐటీఐ పేరును నమోదు చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ఐటీఐలలో అభ్యర్థులకు ఈనెల 27,28 తేదీల్లో మెరిట్ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తారు. ప్రైవేటు ఐటీఐల్లో సీట్లకుఈనెల 29,30తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుంది.

షిర్డీ సాయి ఆలయంలో నేడు గురుపౌర్ణమి వేడుకలు

సీతమ్మధార, జూలై 20: సీతమ్మధార షిర్డీమార్ నార్త్ఎక్స్‌టెన్స్ లేఅవుట్‌లో గల మహాగణపతి, ప్రసన్న వెంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి పూజలకు ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈఓ పైలా శేఖర్‌బాబు తెలిపారు. పౌర్ణమి పూజల్లో భాగంగా ఆలయానికి రంగులు వేసి, విద్యుత్ కాంతులతో సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం 7 గంటలకు సుదర్శన హోమం, బాబాకి ప్రత్యేక అభిషేకం, సాయంత్రం 4 గంటలకు అన్నరాసులతో అన్నాభిషేకం నిర్వహించనున్నారు.



వందేభారత్ రైలులో ప్రయాణించిన శ్రీభరత్, 'పల్లా'

విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శనివారం రాత్రి విజయవాడ నుంచి విశాఖపట్నానికి వందేభారత్ రైలులో ప్రయాణించారు. శనివారం విజయవాడలో జరిగిన టీడీపీ పార్లమెంటరీ సమావేశంలో పాల్గొన్న అనంతరం వారు విశాఖ వచ్చేందుకు వందేభారత్ రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా రైలులో ప్రయాణించే ప్రయాణికులతో మాట్లాడి 'వందేభారత్'లోని సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

24న బ్రహ్మకుమారీస్ శాఖ వార్షికోత్సవం

అగనంపూడి, జూలై 20: ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయం బ్రహ్మకుమారీస్ స్థానిక శాఖ పదో వార్షికోత్సవాన్ని ఈ నెల 24న బీసీ కాలనీలో గల దివ్యజ్యోతి భవనం వద్ద ఘనంగా నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధి బీకే. రామకోటి తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, సంస్థ ముంబై ప్రతినిధి బీకే గణేశ్ బాయిజీ, జిల్లా ఇన్‌చార్జి బీకే వేణి ముఖ్యఅతిథులుగా హాజరై ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రారంభిస్తారన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

భవనం పైనుంచి జారిపడి తాపీమేస్త్రి మృతి

విశాలాక్షినగర్, జూలై 20: జీవీఎంసీ 9వ వార్డులోని విశాలాక్షినగర్ వెటర్నరీ కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి జారి పడి తాపీమేస్త్రి మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. విశాలాక్షినగర్ వెటర్నరీ కాలనీలో భవన నిర్మాణానికి సంబంధించిన సామగ్రిని తాపీమేస్త్రి రౌతు పాపారావు (44) మూడో అంతస్థులోకి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. సామగ్రి లిఫ్ట్ చేసే మెషీన్‌ను మూడో అంతస్థులో అమరుస్తుండగా రెండో ఫ్లోర్‌లో శ్లాబ్ అడ్డంగా రావడంతో దాన్ని సరి చేయడానికి ప్రయత్నిస్తుండగా మెషీన్ ఆకస్మాత్తుగా కిందకు జారిపోయింది. దాంతో పాటు పాపారావు కూడా రెండో అంతస్థు నుంచి కిందకు పడడంతో మెషీన్ స్టాండ్ ఆయన గొంతుపై పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా విజయనగరం జిల్లా మెంటాడ మండలంలోని పోరం గ్రామానికి చెందిన పాపారావు భవన నిర్మాణ కార్మికుడిగా పదేళ్ల నుంచి ఇక్కడ పని చేస్తున్నాడు. ఆయన పదో వార్డు పరిధిలోని వివేకానంద నగర్ ఆరవ లైన్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య గౌరి, కుమారుడు. కుమార్తె ఉన్నారు. కుమార్తె హైదరాబాద్‌లో సీఏ కోర్సు చేస్తుండగా, కుమారుడు ఇంటర్ పూర్తి చేసి బీటెక్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నాడు.

లోతట్టు ప్రాంతాల్లో టీడీపీ నేత పర్యటన

పెదగంట్యాడ, జూలై 20: జీవీఎంసీ 75వ వార్డులోని పలు లోతట్టు ప్రాంతాలను శనివారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకట రమణారెడ్డి పర్యటించారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు డ్రైనేజీల్లో చెత్తాచెదారం ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయన ఏపీ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలకు వెళ్లి చెత్తాచెదారాలను తొలగించేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో డీఈ అప్పారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్యారావు,నాయకులు పెంటయ్య రామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు గురు పౌర్ణమి వేడుకలు

అగనంపూడి, జూలై 20: ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు షిర్డీ సాయి సేవా సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి తెలిపారు. తెల్లవారుజాము 5.15 గంటలకు కాగడ హారతితో పూజా కార్యక్రమాలను ప్రారంభిస్తామని, తొమ్మిది గంటలకు బాబాను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. 11 గంటలకు అన్నాభిషేకం, మధ్యాహ్నం అన్న సమారాధనను చేపడతామని పేర్కొన్నారు.

సినిమా గైడ్

● **డార్లింగ్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీ నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మి (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి)

● **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ),

● **క్రైం రీల్ :** శ్రీకాంతి, సౌజన్య (గోపాలపట్నం),

● **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 56, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 16, పచ్చిమిర్చి 62, కాకరకాయలు 40, బీరకాయలు 24, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజీ 34, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 145, మునక్కాడలు (కిలో) 90, బరబాటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 42, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 38, కీరదోస 28, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 36, కంద 62, దేముడుచిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికం ... కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 95
ఫారం ధర	-- 115
విత్ స్కిన్	-- 200
స్కిన్‌లెస్	-- 210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



ట్రాఫిక్ ఆంక్షల కారణంగా గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డులో బారులుతీరి నిలిచిపోయిన వాహనాలు. (ఇన్‌సెట్లో) గిరిప్రదక్షిణకు వచ్చిన భక్తులతో నిండిన వేపగుంట జంక్షన్

రద్దీగా మారిన రహదారులు

గిరి ప్రదక్షిణ నేపథ్యంలో పలు కూడళ్లలో స్తంభించిన ట్రాఫిక్
బారులుతీరి నిలిచిపోయిన వాహనాలు
ట్రాఫిక్ నియంత్రణకు శ్రమించిన పోలీసులు
భక్తుల సేవలో తరించిన స్వచ్ఛంద సంస్థలు

గోపాలపట్నం, జూలై 20: గిరి ప్రదక్షిణ నేపథ్యంలో పలు ప్రాంతాల్లోని రహదారులు రద్దీగా మారాయి. ఈ నేపథ్యంలో పెట్రోల్ బంక్ కూడలి నుంచి సింహాచలం వైపు వెళ్లే మార్గంలో వాహనాల రాకపోకలను నిషేధించడంతో బీఆర్‌టీఎస్ రహదారి శనివారం సాయంత్రం వందలాది వాహనాలతో స్తంభించిపోయింది. మధ్యాహ్నం నుంచే వేలాది మంది భక్తులు తరలిరావడంతో మూడు గంటలు దాటిన తర్వాత నుంచి ప్రధాన రహదారిలో ట్రాఫిక్ పెరిగింది. దీంతో సాయంత్రం ఐదు గంటల సమయానికి ఎన్ఏడీ నుంచి వేపగుంట కూడలి వరకు వాహనాలు బారులతీరాయి. ప్రధాన రహదారిలో గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్ వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారి పొడవునా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ చిక్కుల నుంచి తప్పించుకునేందుకు గోపాలపట్నం కొండవాలు ప్రాంతం మీదుగా ఉన్న బైపాస్‌తో పాటు గోపాలపట్నం దిగువ ప్రాంతంలో గల రైల్వే స్టేషన్ బైపాస్ రహదారిలో కూడా వాహనచోదకులు రాకపోకలు సాగించడంతో ఆయా రోడ్లు కూడా వాహనాల రద్దీతో స్తంభించిపోయాయి.

సింహాచలం రైల్వే స్టేషన్ కిటకిట

సింహగిరి ప్రదక్షిణలో పాల్గొనేందుకు భక్తులతో సింహాచలం రైల్వే స్టేషన్ కిక్కిరిసిపోయింది. సాధారణ రోజుల్లోనే భక్తులతో ఈ స్టేషన్ రద్దీగా ఉంటుంది. శనివారం గిరి ప్రదక్షిణ కావడంతో ఉదయం నుంచి వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలిరావడంతో స్టేషన్ కిటకిటలాడింది. ఒడిశా, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి భక్తులు రైలు మార్గంలో తరలివచ్చారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం వరకు వచ్చిన పలు రైళ్ల ద్వారా వచ్చిన ప్రయాణికులతో రైల్వే స్టేషన్ ప్రాంగణంతో పాటు స్టేషన్ రోడ్, బీఆర్‌టీఎస్ రహదారి కిటకిటలాడింది.

స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్

గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు సేవలందించాయి. భక్తులకు ఉదయం అల్పాహారం, టీ, బిస్కెట్లు, తాగునీటితో పాటు మధ్యాహ్నం పలుచోట్ల పులిహోర, దద్దోజనం, వెజ్ బిరియానీ, మిరియాల పాలు, గ్లూకోజ్ డ్రింక్స్, మజ్జిగ ప్యాకెట్లు, కాళ్ల నొప్పులు తగ్గేందుకు టాబ్లెట్లు, అమృతాంజన్ వంటి వాటిని వివిధ స్వచ్ఛంద సంస్థలు పంపిణీ చేశాయి. భక్తుల సౌకర్యార్థం జీవీఎంసీ అధికారులు మరుగుదొడ్లు, తాగునీటి, విశ్రాంతి తీసుకునేందుకు షెల్టర్లను ఏర్పాటు చేయగా, వైద్యశాఖ ఆధ్వర్యంలో పలుచోట్ల ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశాయి. పోలీసులు కూడా రహదారి పొడవునా ప్రత్యేక గస్తీ నిర్వహించారు.



పాత గాజువాకలో సింహాచలం బస్సుల కోసం వేచివున్న ప్రజలు



గోశాల కూడలిలో బిస్కెట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వేపగుంట కూడలిలో జనసందోహం

వేపగుంట: సింహగిరి ప్రదక్షిణలో పాల్గొనేందుకు దేవరాపల్లి, కొత్తవలస, చోడవరం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల వాహనాలతో వేపగుంట కూడలి నిండిపోయింది. ఇక్కడ నుంచి బస్సుల్లో గోశాల వరకు అనుమతించారు. ఆటోలను సింహపురి కాలనీ వరకు పరిమితం చేశారు. నగరం నుంచి వచ్చే బస్సులను వేపగుంట వైపు మళ్లించడంతో వాహనా రాకపోకలకు ఇబ్బంది నెలకొంది. మధ్యాహ్నం మూడు గంటల వరకు గోశాల నుంచి గోపాలపట్నం వరకు వెళ్లే బస్సులను శ్రీనివాసనగర్, ప్రహ్లాదపురం మీదుగా వెళ్లేలా చేశారు. ఆ తర్వాత బస్సులంటినీ వేపగుంట మీదుగా అనుమతించడంతో వేపగుంట కూడలిలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ముందస్తుగా వాహనాలు బీఆర్‌టీఎస్ రోడ్డులోకి ప్రవేశించకుండా ఎక్కడికక్కడ బారికేడ్లతో పోలీస్ సిబ్బంది నియంత్రించారు. కాగా గోశాల జంక్షన్‌లో వాహనాల పార్కింగ్‌కు స్థలం సరిపోకపోవడంతో పరిసర ప్రాంతాల్లో చాలామంది వాహనాలను నిలిపివేశారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. బస్సుల రాకపోకలను ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎ.అప్పలరాజు, డీఎం జి.సత్యనారాయణ, చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె.వెంకటరావు, సింహాచలం డిపో మేనేజర్ కె.రాజశేఖర్ పర్యవేక్షించారు. జెడ్సీ కె.హైమావతి ఆధ్వర్యంలో క్లీనింగ్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

కిటకిటలాడిన బస్సులు

గాజువాక: సింహ'గిరి' ప్రదక్షణకు వెళ్లే భక్తులతో బస్సులు కిటకిటలాడాయి. శనివారం ఉదయం పది గంటల నుంచే గిరి ప్రదక్షణకు వెళ్లేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాత గాజువాక బస్టాప్‌నకు చేరుకున్నారు. ఒక్కసారిగా వందలాది మంది తరలిరావడంతో బస్టాప్ కిక్కిరిసిపోయింది. దీంతో సింహాచలం వెళ్లే బస్సులన్నీ రద్దీగా కనిపించాయి. చాలామంది ఆటోలను ఆశ్రయించడతో ఇదే అదునుగా డ్రైవర్లు రేట్లు పెంచేశారు. గత్యంతరం లేక కొంతమంది భక్తులు ఆటోల్లో సింహాచలం తరలివెళ్లారు.



సీఎండీ, తదితరులతో సమావేశమైన కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్

స్టీల్‌ప్లాంటును సందర్శించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 20: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ శనివారం స్టీల్‌ప్లాంటులో పర్యటించారు. ప్లాంట్‌లోని అవార్డు గ్యాలరీ, ఉక్కు ఉత్పత్తి విధానాన్ని పరిశీలించారు. అనంతరం హెచ్ఆర్‌డీ భవనంలో సీఎండీ అతుల్‌భట్, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు. స్టీల్‌ప్లాంటులో ఉద్యోగుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను యాజమాన్యం వివరించింది. అలాగే గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన, చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను యాజమాన్యం తెలియజేసింది. కర్మాగారంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కోసం పలు చర్యలు చేపడుతున్నామని, రాజ్యాంగం ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొంది. ఇదిలావుండగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషన్ సభ్యుని దృష్టికి అసోసియేషన్ తీసుకువెళ్లి, వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు డైరెక్టర్లు ఏకే బాగ్చి, ఎస్‌సీ పాండే, గణేశ్, ప్రసాద్,ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు బయ్యే మల్లయ్య, తౌడన్న, ఎస్.సత్యనారాణ, మోహన్‌బాబు, ఫణీంద్రబాబు, పుల్లారావు, ఎల్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ స్థలం కబ్జాపై హైకోర్టు ఉత్తర్వులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 20: స్టీల్‌ప్లాంటుకు చెందిన హెచ్‌బీ కాలనీ క్వార్టర్స్‌లో 15 గజాల స్థలాన్ని ఉక్కు విజిలెన్స్ విభాగం విశ్రాంత అధికారి ఆక్రమించాడు. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో, దీనిని ఖాళీ చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు ఉక్కు అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే జీవీఎంసీకి చెందిన స్థలాన్ని కూడా ఆక్రమించి భవనం నిర్మించారనే సమాచారంతో చర్యలు తీసుకోవాలని కోరినట్టు ఉక్కు అధికారులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

అక్కిరెడ్డిపాలెం, జూలై 20: జీవీఎంసీ 69వ వార్డు పరిధి రెడ్డి తుంగ్లాంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల మూలంగా మలేరియా, డెంగ్యూ, అతిసార వంటి వ్యాధులు వ్యాపిస్తాయని, అందువల్ల ప్రజలందరూ తమ ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఆరోగ్యపరంగా ఏమైనా ఇబ్బందులుంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ అప్పలరాజు, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారులో స్టాల్స్‌ను పరిశీలించిన ఏడీఎం



టమాటా స్టాల్ వద్ద ఏడీఎం యాసిన్, తదితరులు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 20: మర్రిపాలెం రైతుబజారును శనివారం ఏడీఎం యాసిన్ సందర్శించారు. ఈ సందర్భంగా సబ్సిడీ బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్న స్టాళ్లతో పాటు రాయితీపై విక్రయిస్తున్న టమాటా స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. రైతుబజారులోకి టమాటా హోల్ సేల్ వర్తకులు రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. పలువురు వినియోగదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈవో వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం ధాటికి కుప్పకూలిన రిటెయినింగ్ వాల్స్

మల్కాపురం, జూలై 20: జీవీఎంసీ 60వ వార్డు హనుమాన్ సంజీవ్ కాలనీలోని రిటెయినింగ్ వాల్ శనివారం ఒక్కసారిగా పెద్ద శబ్దంతో కూలిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి వాల్ దిగువున్న మట్టి బాగా నానిపోవడంతో రిటెయినింగ్ వాల్ కుప్పకూలిపోవడంతో అక్కడ పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు బాగా దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని టీడీపీ వార్డు అధ్యక్షుడు మాతా శ్రీనివాసరావు ఎమ్మెల్యే గణబాబుకు దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ములగాడ తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా తమ సిబ్బందిని ఘటనా స్థలానికి పంపడంతో వారు వచ్చి పరిశీలించారు. జీవీఎంసీ అధికారులతో మాట్లాడి గోడ నిర్మాణానికి తగిన చర్యలు చేపడతామన్నారు. కాగా స్థానిక యువకులు శిథిలాలను తొలగించారు.

టీడీపీ కాలనీలో..

సింధియా: వర్షాలకు 62వ వార్డు పరిధి టీడీపీ కాలనీ కొండ ప్రాంతంలో శనివారం రిటెయినింగ్ వాల్ ఒకపక్క కూలిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి నీలాపు జోగి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, రిటెయినింగ్ వాల్‌కు త్వరలో మరమ్మతులు చేపడతామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డీఈ ఏడుకొండలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



60వ వార్డు హనుమాన్ సంజీవ్ కాలనీలో కూలిన రిటెయినింగ్ వాల్



62వ వార్డు టీడీపీ కాలనీలో కుప్పకూలిన రిటెయినింగ్ వాల్

గట్టు, జెర్రిపోతులపాలెం, ఇప్పిలివానిపాలెం, నందవానిపాలెం ప్రాంతాలకు వెళ్లే వేలాది మంది ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. రెండున్నర అడుగుల ఎత్తులో ప్రవహిస్తున్న నీటిలో ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించడం కష్టసాధ్యంగా మారింది. ముందు ముందు భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల వెంటనే అధికారులు,నేతలు స్పందించి ముంపు నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కొత్తపాలెం శివారులో తగ్గని వరద నీరు

గోపాలపట్నం: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు గోపాలపట్నం దిగువనున్న లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం తగ్గుముఖం పట్టినా కొత్తపాలెం శివారులో వరద నీరు నిలిచే ఉంది. దీంతో కొత్తపాలెం నుంచి సబ్బ వరం వెళ్లే ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించే జనాలు ఇబ్బందులు పడ్డారు. 15 ఏళ్లుగా ఈ ముంపు సమస్యతో శివారు ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా పాలకులు పట్టిం చుకోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో గోపాలపట్నం నుంచి కొత్తపాలెం, నరవ గ్రామాల మీదుగా సబ్బవరం వెళ్లే వాహన చోదకులతోపాటు నరవ, కోటనరవ, సత్తివానిపాలెం,చింత

చెరువులకు జలకళ

పెందుర్తి: రెండు రోజులు పాటు ఏకధాటిగా కురిసిన వర్షాలకు చెరువులకు జలకళ సంతరించుకున్నాయి. వారం రోజుల క్రితం వరకు సగం కూడా నీరు లేని చెరువులు ప్రస్తుతం నిండుకుండను తలపిస్తున్నాయి. మండలంలో సుమారు 105కు పైగా చెరువులున్నాయి. వీటిలో సగానికి పైగా చెరువులు వర్షాలకు నిండాయి. పెందుర్తి పాత ఊరు, సరిపల్లి, ముదపాక, పినగాడి, రాంపురం, ఎస్ఆర్ పురం, రాజయ్యపేట, గొరపల్లి, గ్రామాల్లో గల చెరువుల్లో ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరడంతో సమృద్ధిగా నీటితో కనిపిస్తున్నాయి. రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు.



కొత్తపాలెం-నరవ వెళ్లే ప్రధాన రోడ్డులో తిష్ఠ వేసిన వర్షపు నీరు



కొత్తపాలెం-నరవ వెళ్లే ప్రధాన రోడ్డులో తిష్ఠ వేసిన వర్షపు నీరు



బస్సుకు పూజ చేస్తున్న పూసపాటి అశోక్‌గజపతిరాజు

నూతన ఎలక్ట్రిక్ బస్సు ప్రారంభం

సింహాచలం, జూలై 20: వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తుల ప్రయాణ సౌకర్యార్థం కొనుగోలు చేసిన నూతన ఎలక్ట్రిక్ బస్సును దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన బస్సులో ఈఓ శ్రీనివాసమూర్తి, అధికారులతో కలిసి సింహగిరికి చేరుకుని అప్పన్నస్వామిని దర్శించుకున్నారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలి

టెలీ కాన్ఫరెన్స్‌లో మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాఖపట్నం, జూలై 20: వర్షాల ప్రభావంతో కలిగే విద్యుత్ ప్రమాదాలు, విద్యుత్ అంతరాయాల పట్ల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. శనివారం ఆయన ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, సంస్థ డైరెక్టర్లు, ఎస్ఈలు, ఈఈలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల ఏర్పడిన విద్యుత్ అంతరాయాలను త్వరితగతిన పునరుద్ధరించాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. వరద ప్రవాహానికి గురైన కుక్కునూరు, వేలేరుపాడు ప్రాంతాల్లో పరిస్థితిపై ఆరా తీశారు. వర్షాల వల్ల తెగిపడిన విద్యుత్ వైర్లు, స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే సరి చేయాలన్నారు. కాగా విద్యుత్ అంతరాయాల ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించేందుకు ఐదు సర్కిళ్లలో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేశామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1912, వాట్సాప్ నంబర్ 8500001912, కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు శ్రీకాకుళం 9490612633, విజయనగరం 9490610102, విశాఖపట్నం 7382299975, రాజమండ్రి 738229960, ఏలూరు 9440902926లను సంప్రదించాలని ఆయన కోరారు.



..పాల్గొన్న కూటమి నాయకులు

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

సింధియా, జూలై 20: గ్రేటర్ 63వ వార్డు జై ఆంధ్రా కాలనీలో శనివారం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ప్రారంభించారు. కాకరలోవ, చింతలలోవ ప్రాంతాల్లో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతుండడంతో కార్పొరేటర్ గల్లా చిన్నా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్ఆర్‌రాజు, జనసేన నాయకులు జి.శివ, పుక్కళ్ల కృష్ణ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ వీఎస్ఈజెడ్ ద్వారా రెట్టింపు ఎగుమతులు

కూర్మన్నపాలెం, జూలై 20: దువ్వాడ వీఎస్ఈజెడ్ మొదటి త్రైమాసికంలో గత ఏడాదితో పోలిస్తే 18 శాతం వృద్ధి రేటు సాధించిందని కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాస్ తెలిపారు. వీఎస్ఈజెడ్ పరిపాలనా భవనంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మొదటి మూడు నెలలకు గాను రూ.62,198 కోట్ల విలువైన వస్తువులను ఎగుమతులు చేసినట్టు పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో మూడు వీఎస్ఈజెడ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. కాగా రెండు ఎక్స్‌పోర్టు ఓరియంటెడ్ యూనిట్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు రాగా, వాటికి ఆమోదం తెలిపామన్నారు.

సిద్ధార్థనగర్ వాటర్ ప్లాంటును పరిశీలించిన కార్పొరేటర్

కూర్మన్నపాలెం, జూలై 20: తాగునీరు దుర్వాసన వస్తుందని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు 87వ వార్డులోని సిద్ధార్థనగర్ వాటర్ ప్లాంట్‌ను శనివారం కార్పొరేటర్ బొండా జగన్ పరిశీలించారు. నీరు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని తాగునీటి విభాగ సిబ్బందికి సూచించారు. ఉన్నతాధికారులు ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

కనకమహాలక్ష్మికి తులసీ దళార్చన

పూర్ణామార్కెట్, జూలై 20: కనకమహాలక్ష్మికి తులసీదళార్చన సేవలను శనివారం నిర్వహించారు. అమ్మవారి విగ్రహం వద్ద తులసీ దళాలతో అర్చకులు ఉభయదాతల చేత పూజలు జరిపించారు.

సింహగిరి ప్రదక్షిణలో అడుగడుగునా భక్తి భావం

▸▸ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం, పండ్లు పంపిణీ

సీతమ్మధార, జూలై 20: సీతమ్మధార నృసింహ స్వామి స్మరణతో మారుమోగింది. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు సీతమ్మధార ప్రధాన రహదారిలో వెళ్తూ ఇక్కడి వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సీఎంఆర్ ఏర్పాటు చేసిన వరహాలక్ష్మీనృసింహ స్వామికి పూజలు చేశారు. కూడలిలో భక్తులకు వైద్య శిబిరం, పలువురు తాగునీరు, మజ్జిగ, పులిహోర, దద్దోజనం, ఇతర ఆహార పదార్థాలను స్వచ్ఛందంగా పంపిణీ చేశారు. సీతమ్మధార సాయిబాబాభజనమండలి భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గిరిప్రదక్షిణకు వచ్చిన భక్తులతో నరసింహనగర్, పోర్టు సాలిగ్రామపురం, కైలాసపురం తదితర ప్రాంతాలు కిటకిటలాడాయి. వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు దారిపొడవునా, ఫ్రూట్స్, ప్రసాదం, తాగునీరు, బాదం పాలు, టిఫిన్, పులిహోర అందించారు. ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ భక్తులకు బాదం పాలు పంపిణీ చేశారు. నరసింహనగర్‌లో లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ అధినేత డాక్టర్ రామ్‌కుమార్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

మద్రిపాలెం: సింహాద్రి అప్పన్న ప్రచార సమాఖ్య ఆధ్వర్యంలో అర్‌అండ్‌బీ సమీపంలో భక్తులకు బిస్కెట్లు, పాలు, టీతోపాటు నొప్పుల నివారణ మందులను పంపిణీ చేశారు. భక్తులు కూర్చొని సేదతీరేందుకు కుర్చీలుఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక వేత్త ఎంవీరాజశేఖర్, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, ప్రచార సమాఖ్య వ్యవస్థాపకులు సనపల నారాయణస్వామి, సభ్యులు పొన్నాడ రాంబాబు, సనపల ధనంజయస్వామి తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు ప్రసాదం అందచేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మురళీనగర్: మాధవధార రోడ్డులో వైసీపీ మహిళా ఉపాధ్యక్షురాలు పి.రమణికుమారి అధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు, తాగునీరు అందించారు. మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీలవద్ద మానవసేవే మాధవసేవ అసోసియేషన్, ఎన్‌జీజీఓస్ కాలనీ సంక్షేమసంఘం, మాధవధార ఉడాకాలనీ సంక్షేమ సంఘం సహా 48ఏ మెయిన్ రోడ్డులో వ్యాపారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రసాదాలు, పాలు, మజ్జిగ అందజేశారు.

సీతమ్మధార: గ్రేటర్ విశాఖ 14వ వార్డు సీతమ్మధార పాపా హోమ్ ఎదురుగా సింహాచలం గిరి ప్రదక్షిణలో పాల్గొన భక్తులకు విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రసాదం, తాగునీరు పంపిణీ చేశారు. కూటమినేతలు పాల్గొన్నారు

కందిపప్పు, బియ్యం స్టాల్స్ తనిఖీ

అక్కయ్యపాలెం, జూలై 20: గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో ప్రభుత్వం ఏ ర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం స్టాల్ ను జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి (డీఎస్‌వో) జి.సూర్యప్రకాశ్ శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఇప్పటి వరకూ ఎంత మంది వినియోగదారులకు కందిపప్పు, బియ్యం విక్రయించారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ స్టాల్ వ్యాపారి ఎవరి వివరాలు సేకరించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తనకు సమాచారమివ్వాలని ఆర్ఐ మురళీకృష్ణను ఆదేశించారు. డీఎస్‌వోతో పాటు రైతుబజారు సహాయకుడు ఆర్.సత్యనారాయణ, స్టాల్ అధినేత చంద్రశేఖర్ ఉన్నారు.

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు, టమాటా వి క్రయాలను జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారి షేక్ యాసిన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'ముట్నూరి'కి మహతి నాదనిధి బిరుదు ప్రదానం



ప్రముఖ గాయని జలజాక్షిని సత్కరిస్తున్న దృశ్యం

సీతంపేట, జూలై 20: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కార్తికేయ కళాక్షేత్ర సంస్థ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సంగీత విద్వన్మణి మల్లాప్రగడ జోగులాంబ జ్ఞాపకార్థం వారి శిష్యులు, కుటుంబ సభ్యులు, నిర్వాహకులు సంయుక్తంగా ప్రముఖ గాయకురాలు ముట్నూరి జలజాక్షిని మహతి నాద నిధి బిరుదుతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏఐఆర్ విశ్రాంత స్టేషన్ డైరెక్టర్ కాకరపర్తి సత్యనారాయణ, బీవీకే కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీఎస్ఎస్ మూర్తి గురుపౌర్ణమి విశిష్టత వివరించారు. అనంతరం ప్రముఖ వాగ్గేయకారుడు మంగళపల్లి బాలమురళీకృష్ణ రచనలతో డాక్టర్ నిష్టల కృష్ణవేణి వీణావాదనం తో ఆహూతులను అలరింపజేశారు. వి.అరుణ, ఎం.ఏడుకొండలు, హనుమంతరావులు వీణ, మృదంగంతో సహకరించారు.

సీఎంఆర్ ఆధ్వర్యంలో ప్రసాదాల వితరణ



ప్రసాదం పంపిణీ చేస్తున్న సీఎంఆర్ నిర్వాహకులు

మద్దిలపాలెం: గిరి ప్రదక్షిణ సందర్భంగా సీతమ్మధార వెంకటేశ్వర ఆలయం వద్ద శనివారం సీఎంఆర్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు. సీఎంఆర్ చైర్మన్ మావూరి వెంకటరమణ, డైరెక్టర్లు మావూరి వెంకటపద్మావతి, మావూరి హారిక భక్తులకు చక్కెర పొంగలి, బిస్కెట్ ప్యాకెట్లు, పండ్లు, టీ, బాదం పాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీవరహా లక్ష్మీనరసింహ స్వామి ప్రతిమను ప్రతిష్ఠించి చందనం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సీఎంఆర్ జనరల్ మేనేజర్ నూలు లింగమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవం

సిరిపురం, జూలై 20: దేశంలోనే 2వ అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్.. బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవం సిరిపురం కూడలిలోని చిల్డ్రన్స్ ఎరినా ఆడిటోరియంలో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బ్యాంక్ విశాఖపట్నం రీజియన్ రీజనల్ మేనేజర్ పి. ఎం.పదాన్ మాట్లాడారు. బ్యాంక్ 116 ఏళ్ల పూర్తి చేసుకుని 117వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందన్నారు. బ్యాంక్ స్థాపించిన నాటి నుంచి ఖాతాదారుల ఆదరణను చూరగొని దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంక్‌గా నిలిచిందన్నారు. బ్యాంక్ అందరి అవసరాలకు తగ్గట్లు అన్ని



ప్రసంగిస్తున్న రీజియన్ మేనేజర్ పదాన్

రకాల రుణాలను అందిస్తుందని పేర్కొన్నారు. మరింత మెరుగైన సేవలందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ రీజనల్ ఆఫీస్, ఇతర బ్రాంచీలలో రక్తదాన శిబిరాలు, ఇతర సామాజిక కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ముఖ్యఅతిథిగా ఎల్ఐజీ చీఫ్ రీజనల్ మేనేజర్ శారదాప్రసాద్ పాల్గొన్నారు. పలువురు ఖాతాదారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి డీఆర్ఎం సతీషాసాలుంకే, బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు, చీఫ్ మేనేజర్లు, నగరంలోని వివిధ బ్రాంచీల మేనేజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

24న లైమ్ లైట్స్ అవార్డుల ప్రదానం

అక్కయ్యపాలెం, జూలై 20: ఈవెంట్ మేనేజర్ల అసోసియేషన్ (ఈమా) విశాఖ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన లైమ్ లైట్స్ అవార్డుల ప్రదానోత్సవం మధురవాడలోని వీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు సందీప్ కుమార్, షరీఫ్ ఖాన్ తెలిపారు. నరసింహనగర్‌లోని తమైరా స్కిన్ క్లినిక్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ వే డుకల్లో భాగంగా ప్రతిభావంతమైన ఈవెంట్ మేనేజర్లకు, కళాకారులకు, ఈవెంట్ రంగంలో వేర్వేరు శాఖలోని ప్రతిభావంతులకు అవార్డుల ప్రదానం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన స్పాన్సర్ తమైరా స్కిన్, బ్యూటీ క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి స్వరూప్, ఈమా ఆర్గనైజింగ్ సెక్రటరీ జీఎన్‌రాజు, జాయింట్ సెక్రటరీ సంతోష్ కుమార్, కార్యవర్గం సభ్యుడు జగదీష్, ఆశా పట్నాయక్ పాల్గొన్నారు.

రసాయనిక శాస్త్రంలో అనిల్‌కుమార్ ప్రథమ ర్యాంక్



అనిల్‌కుమార్

మహారాణిపేట, జూలై 20: ఆంధ్ర ప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ (ఏపీ ఆర్‌సెట్-24)లో బూసి అనిల్ కుమార్‌కు రసాయనిక శాస్త్ర విభాగంలో మొదటి ర్యాంక్ వచ్చింది. విశాఖకు చెందిన అనిల్ కుమార్ ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలో అధ్యాపకుడు డాక్టర్ మామిడి గోపి వద్ద శిక్షణ పొందారు. అతని సూచనలు సలహాలతో ఈ ర్యాంక్ సాధించినట్టు అనిల్‌కుమార్ తెలిపారు.

ప్రజల గుణపాఠం నుంచైనా పాఠాలు నేర్వరా?

▸▸ జగన్‌పై మాజీ మంత్రి గంటా ఫైర్

డాబాగార్డెన్స్, జూలై 20: వైసీపీ పాలనపై విసుగు చెందిన ప్రజల చరిత్ర ఎరుగని తీర్పునిచ్చినా ఆ పార్టీ అధినేత అర్థరహిత విమర్శలు మానుకోలేదని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసినా ఆయన గుణపాఠం నేర్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఇంకా రెండు నెలలైనా కాలేదని గుర్తు చేశారు. ఇంతలోనే ప్రజా తీర్పునకు కలత చెంది మొన్నటి వరకు హిమాలయాలకు వెళ్లిపోతానన్న వారు ఇప్పుడు రాష్ట్రపతి పాలన పెట్టాలని అడుగుతుండడంతో శోచనీయమని అన్నారు. మీ ఆత్మగా వ్యవహరిస్తున్న ఎంపీ మధ్యంతర ఎన్నికలు పెడితే మళ్లీ తమ పార్టీ అధికారంలోకి వస్తుందని అంటున్నారన్నారు. ఇలా తలో రకమైన వ్యాఖ్యలు చూస్తే మీ మానసిక పరిస్థితిని ఎలా అర్థం చేసుకోవాలో తెలియడంలేదన్నారు. రాష్ట్రంలోని అరాచకాలపై ఈనెల 24న ఢిల్లీలో ధర్నా చేస్తానంటున్న మీ మాటలు... దెయ్యాలు వేదాలు వల్లించినట్టున్నాయని అనిపించడంలేదా.. అని గంటా ప్రశ్నించారు. కరోనా సమయంలో మాస్కు అడిగిన పాపానికి విశాఖలో దళిత డాక్టర్ సుధాకర్‌ను చనిపోయే వరకు వేధించారన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ అనంతబాబు దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేశారన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే మీరు చేసిన పాపాలు, పాతకాలకు అంతేలేదన్నారు.

వరద నీటి ముంపు సమస్య పరిష్కరించాలి

▸▸ ఎమ్మెల్యే వంశీకృష్ణ

జగదాంబ కూడలి, జూలై 20: వన్‌టౌన్ పరిధిలో వరదనీటి ముంపు ప్రాంతాల సమస్య పరిష్కరించాలని అధికారులు ఎమ్మె ల్యే వంశీ కృష్ణ ఆదేశించారు. శనివారం గ్రేటర్ 39 వార్డులోని చిలకపేట ప్రాంతంలో కాలువలు, అండర్ డ్రైన్లు రోడ్లపై పొంగిపొర్లడంతోపాటు నీరు ఇళ్లలోకి చేరడంతో నివాసితులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.ఈ సందర్భంగా వారి సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వర్షం వస్తే కాలువలు పొంగి మురుగునీరంతా ఇళ్లలోకి చేరుతుందని చిలకపేట, లక్ష్మీటాకీస్ ఏరియా ప్రజలు దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే పాతపోస్టాఫీసు నుంచి లక్ష్మీటాకీస్ వరకు అండర్ డ్రైన్లు, కాలువల నిర్మాణంలో లోపాలను పరిశీలించారు.

కాలువల్లో పూడిక, చెత్త పేరుకుపోవడంతో తలెత్తుతున్న ఇబ్బం దులు స్థానికులు వివరించారు. మురుగునీరు కుళాయిల్లో కలసి తాగునీరు కలుషితమవుతోందని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు.



చిలకపేట ఏరియాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

కిడ్నీ మార్పిడి పేరిట మోసం కేసులో నిందితుడి అరెస్టు

సీతంపేట, జూలై 20: కిడ్నీ మార్పిడి పేరిట రూ.10 లక్షలు వసూలు చేసి మోసగించిన కేసులో నిందితుడైన ఓ ఆస్పత్రిలోని అసిస్టెంట్ కో ఆర్డినేటర్ అనిల్‌ను ద్వారకా స్టేషన్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..పెందుర్తికి చెందిన సత్యనారాయణ గోపి, శారద లక్ష్మీ దంపతులు. శారద లక్ష్మీ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ స్థితిలో కిడ్నీ మార్చకుంటే ప్రాణానికి హాని అని వైద్యులు తెలిపారు. దీంతో సత్యనారాయణ గోపి సీతమ్మధారలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి వచ్చి నెఫ్రాలజిస్టును సంప్రదించారు. అనంతరం ఆ వైద్యురాలి సూచనపై కిడ్నీ కోసం తన అసిస్టెంట్ కో ఆర్డినేటర్ అనిల్‌ను సంప్రదించారు. కిడ్నీ ఏర్పాటుతోపాటు వైద్య ఖర్చులతో కలిపి రూ. 27 లక్షలు అవుతుందని అనిల్ తెలిపాడు. ఈ ఒప్పందం మేరకు సత్యనారాయణ రూ.10 లక్షలు అనిల్‌కు ఇచ్చాడు. అనంతరం అనిల్ కిడ్నీ సమకూర్చకుండా దాటవేస్తూ వచ్చారు. ఇంతలో 2022లో సత్యనారాయణ గోపి జీవన్‌ధాన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో కిడ్నీ అందుబాటులో రావడంతో నగరంలోని ఓ ఆస్పత్రి శారద లక్ష్మికి వైద్యం చేయించాడు. అనంతరం సీతమ్మధారంలోని ఆస్పత్రిలోని వైద్యురాలు, ఆమె అసిస్టెంట్ అనిల్‌ను కలిసి తాను చెల్లించిన రూ. 10 లక్షలు ఇవ్వాలని కోరాడు. వారు నిరాకరించడంతో మోసపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్ రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేశారు. నగర పోలీసు కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విచారణ చేపట్టింది. ఈ క్రమంలో కిడ్నీ కోసం రూ. 10 లక్షలు తీసుకున్న అనిల్‌ను ద్వారకా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసును పలు కోణాల్లో ప్రత్యేక బృందం విచారణ చేపడుతోంది. మరి కొద్దిరోజులు ఈ నేరంలో పాలుపంచుకున్న వారందరిని అరెస్టు చేయనున్నట్లు సమాచారం.



అరెస్టు చేసిన అనిల్ (ఫైల్)

భక్త జనసంద్రం

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. అనంతరం ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలాపనలు, పండితుల వేద మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తితో కలిసి జెండాను ఊపి సింహగిరి ప్రదక్షిణకు అశోక్‌గజపతిరాజు లాంఛనంగా శ్రీకారం చుట్టారు. తేరుకు ముందుభాగాన దేవస్థానం అధికారులు ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సింహాచలం తొలి పావంచా వద్ద ప్రారంభమైన పుష్పతేరు (పూల రథం) పాత అడివివరం, హనుమంతువాక, జాతీయ రహదారి నుంచి మద్దిలపాలెం, గురుద్వారా, మురళీనగర్ కూడలి, ఎన్ఏడీ, గోపాలపట్నం బంక్, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం తొలిపావంచాకు చేరుకుంది. పూలరథాన్ని లక్షలాది మంది భక్తులు అనుసరించారు. ఉత్సవంలో పాల్గొనేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మాత్రమే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు. ముందుగా రూపొందించి ప్రణాళికల ప్రకారం దేవస్థానం అధికారులు తొలిపావంచా వద్ద ఏర్పాటుచేసిన 80 ఇనుప గడ్డర్లపై భక్తులు లక్షల సంఖ్యలో కొబ్బరికాయలను కొట్టారు. వాటిని పోగుచేసుకునేందుకు కాంట్రాక్టర్ ప్రత్యేక వాహనాలను, పనివార్లను వినియోగించారు. కొంతమంది భక్తులు సింహగిరి ప్రదక్షిణను ముగించుకుని పలువురు భక్తులు రాత్రి తొమ్మిది గంటలకే తిరిగి తొలిపావంచాకు చేరుకున్నారు.

భక్తులకు స్వచ్ఛంద సంస్థల సేవలు

తొలి పావంచా మొదలుకొని పాత అడివివరం, హనుమంతువాక, హెచ్‌బీ కాలనీ మీదుగా గోపాలపట్నం వరకూ భక్తులు నడిచే మార్గాల్లో సేవాసంస్థలు శిబిరాలు ఏర్పాటు చేసి అల్పాహారం, మజ్జిగ, బాదంపాలు, టీ, కాఫీలు, తాగునీరు సరఫరా చేశాయి. అలసిపోయిన భక్తుల కాళ్లకు సత్యసాయి సేవా సంస్థల సిబ్బంది సుమారుగా వంద మంది ప్రత్యేకంగా తయారుచేసిన నూనెతో మర్దనా చేసి సాంత్వన చేకూర్చారు. మానవ సేవే..మాధవ సేవ అనే మాటలను పూర్తిగా విశ్వసించి భక్తులకు సేవలు అందించారు.

రసకందాయంలో గ్రేటర్ రాజకీయం

... 5వ పేజీ తరువాయి

ప్రతిపాదన పెట్టారు. ఇలా 25 మందికిపైగా కార్పొరేటర్లు వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. కానీ వారిలో వివాదాస్పదమైనవారు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు, గతంలో పార్టీ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐదుగురిని పార్టీలో చేర్చుకునేందుకు టీ డీపీ నేతలు తిరస్కరించినట్టు తెలిసింది. ఈ మేరకు శుక్రవారం ఒక హోటల్‌లో టీడీపీ నేతలు, కార్పొరేటర్లు సమావేశమై ఈ అంశంపై ఏకాభిప్రాయం వ్యక్తంచేసినట్టు తెలిసింది. పార్టీలో చేరేందుకు ఆసక్తిగా ఉన్నవారిలో 20 మంది కార్పొరేటర్లను ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో పార్టీలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని టీడీపీ నేతలు చెబుతున్నారు.

కార్పొరేటర్లను కాపాడుకునే ప్రయత్నాల్లో వైసీపీ నేతలు

పార్టీ కార్పొరేటర్లు కొందరు టీడీపీలో చేరిపోవాలని నిర్ణయించుకోవడంతో వారిని కాపాడుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అధ్యక్షతన మేయర్ ఛాంబర్‌లో కార్పొరేటర్లతో ఆ పార్టీ నేతలు శనివారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సమావేశానికి 30 మంది కార్పొరేటర్లు మాత్రమే హాజరుకాగా 30 మంది గైర్హాజరవ్వడం ఆ పార్టీ నేతలను అవాక్కయ్యేలా చేసింది. సమావేశానికి హాజరైన 30 మందిలో పది మంది కార్పొరేటర్లు ఆ పార్టీ నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తినట్టు సమాచారం. పార్టీలో కనీస మర్యాద ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఇంతకాలం కార్పొరేటర్లను పట్టించుకోకుండా ఇప్పుడు మేయర్ పదవిని కాపాడుకోవడానికి పార్టీలోనే ఉండాలంటూ ఎలా చెబుతారంటూ మాజీ మంత్రి అమర్‌నాథ్‌ను నిలదీసినట్టు సమాచారం. సమావేశం రసాభాసగా మారడంతో చివరకు 'మీ ఇష్టం మరి. మేం చెప్పాల్సింది చెప్పాం' అని పార్టీ నేతలంతా చేతులెత్తేసినట్టు తెలిసింది.

నెలాఖరులోగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ పదవీకాలం ఈనెల 27తో ముగుస్తుంది. కొత్తకమిటీని ఎన్నుకోవాల్సి ఉంది. వైసీపీకి చెందిన 20 మందికిపైగా కార్పొరేటర్లు టీడీపీలో చేరాలని నిర్ణయించడంతో టీడీపీ బలం 48కి చేరుతుంది. జనసేన, బీజేపీని కలుపుకుంటే 54కి పెరుగుతుంది. స్టాండింగ్ కమిటీలోని పది మంది సభ్యులను 97 మంది కార్పొరేటర్లు ఎన్నుకోవాల్సి ఉంటుంది. కూటమికి 54 మంది కార్పొరేటర్ల బలం ఉండడంతో పది స్థానాలను కూటమి అభ్యర్థులే గెలుచుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ల చేరికలు పూర్తికాగానే ఈ నెలాఖరులోపే స్టాండింగ్ కమిటీ ఎన్నిక నిర్వహించనున్నారు. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత వచ్చే నెల మూడున కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. దీని కోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే కనీసం నాలుగేళ్ల పదవీకాలం పూర్తవ్వాలనే నిబంధన ఉంది. ప్రస్తుతం అమలులో ఉన్న మునిసిపల్ చట్టాన్ని సవరణ చేస్తే తప్ప మేయర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు వీల్లేదు. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో మునిసిపల్ చట్టాన్ని సవరిస్తే వెంటనే ప్రస్తుత మేయర్‌ను పదవి నుంచి దింపి ఆ పదవిని తాము కైవసం చేసుకోవాలని టీడీపీ నేతలు భావిస్తున్నారు.

కేజీహెచ్‌లో ఫ్లోరోసెంట్ లైన్స్

... 5వ పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. ఏఏ రంగులు ఏయే వార్డులు, ఓపీలు, విభాగాలను ఏర్పాటు చేయాలన్న దానిపై ఆస్పత్రి అధికారులు ప్రస్తుతం సమా లోచనలు చేస్తున్నారు. గిరి ప్రదక్షిణ తరువాత కలెక్టర్ అనుమతితో ఫ్లోరోసెంట్ లైన్స్‌ను వేసే పనిని ప్రారంభిస్తా మని సూపరింటెండెంట్ శివానంద వెల్లడించారు.

ఏడుచోట్ల హెల్ప్ డెస్క్‌లు

ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎదురవుతున్న ఇబ్బందులు దృష్ట్యా ఎంపీ, ఎమ్మెల్యేల సూచన మేరకు ప్రాంగణంలో ఏడుచోట్ల హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటుచేయాలని అధికా రులు నిర్ణయించారు. ఒక్కో హెల్ప్ డెస్క్ వద్ద ఒక సహాయకుడిని అందుబాటులో ఉంచనున్నారు. వీరు ఉదయం నుంచి సాయంత్రం వరకూ రోగులకు కావలసిన సమాచారాన్ని, సహకారాన్ని అందిస్తారు. ఈ హెల్ప్ డెస్క్‌లను రాజేంద్ర ప్రసాద్ వార్డు, భవనగర్ వార్డు, క్యాజువాలిటీ, సీఎస్ఆర్ బ్లాక్, ఇన్‌గేట్, మందులు ఇచ్చే కౌంటర్, సూపరింటెండెంట్ కార్యాలయం బయట ఏర్పాటు చేయనున్నారు. రోగులకు అవసరమైన సమాచారాన్ని అందించి సకాలంలో వైద్య సేవలు పొందేలా చేసేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

'రెల్లి సంక్షేమ సంఘం సత్తా చాటుతాం'

మహారాణిపేట, జూలై 20: రెల్లి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రలో భారీ సమావేశం నిర్వహించి సత్తా చాటుతామని జాతీయ రెల్లికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు భూపతి అప్పారావు అన్నారు. శనివారం స్థానికంగా ఓ సమావేశ మందిరంలో రెల్లి కుల సంక్షేమ సంఘం యువతీ యువకులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభు త్వాలు రెల్లి కులస్తుల జనాభాను శూన్యంగా పరిగణించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో తమ సత్తా చాటేందుకు ఉత్తరాంధ్రలో భారీ సమావేశం నిర్వహించి ప్రభుత్వాలకు తమ ఉనికి తెలియజేస్తామన్నారు. రాష్ట్రంలో సఫాయి కర్మచారి ఉద్యోగాలు 48 ఖాళీగా ఉన్నాయని తెలిపారు. విశాఖ జిల్లా సఫాయి కర్మచారి సంఘం అధ్యక్షుడిగా బంగారి సింహాచలంను నియమించారు. రిటైర్డ్ ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ వడ్డాది అప్పల రాజు , కస్తూరి వెంకట రావు, మాడుగుల సత్యనారాయణ, చొక్కాకుల రాంబాబు బంగారు రవిశంకర్, వై. శ్రీనివాస్‌రావు, టి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

25 వరకు ఐటీఐ దరఖాస్తు గడువు

కంచరపాలెం, జూలై 20 : జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ఈనెల 24వ తేదీతో ముగియనున్నది. ఈ మేరకు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన వారు సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో తమ ధ్రువపత్రాలను పరిశీలన చేయించికుని తగిన రసీదును పొందాలన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఈనెల 25వ తేదీ వరకు గడువు ఉందన్నారు. అభ్యర్థి ఏ ఐటీఐలో చేరదలచుకుంటే ఆన్‌లైన్‌లో సదరు ఐటీఐ పేరును నమోదు చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ఐటీఐలలో అభ్యర్థులుకు ఈనెల 27,28 తేదీల్లో మెరిట్ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తారు. ప్రైవేటు ఐటీఐల్లో సీట్లకుఈనెల 29,30తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుంది.

షిర్డీ సాయి ఆలయంలో నేడు గురుపౌర్ణమి వేడుకలు

సీతమ్మధార, జూలై 20: సీతమ్మధార షిర్డీమార్ నార్త్‌ఎక్స్‌టెన్స్ లేఅవుట్‌లో గల మహాగణపతి, ప్రసన్న వెంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి పూజలకు ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈఓ పైలా శేఖర్‌బాబు తెలిపారు. పౌర్ణమి పూజల్లో భాగంగా ఆలయానికి రంగులు వేసి, విద్యుత్ కాంతులతో సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం 7 గంటలకు సుదర్శన హోమం, బాబాకి ప్రత్యేక అభిషేకం, సాయంత్రం 4 గంటలకు అన్నరాసులతో అన్నాభిషేకం నిర్వహించనున్నారు.

నేడు రక్తదాన శిబిరం

భీమునిపట్నం, జూలై 20 : పట్టణంలోని నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, యరబాల చారిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం జరగనుంది. ఈమేరకు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని ది సన్ స్కూల్ ఆవరణలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని, రక్తదానం చేయాలని కోరారు.

నేడు హోమియో వైద్య శిబిరం

భీమునిపట్నం, జూలై 20 : పట్టణంలోని చిన్నబజారులో ఉన్న డచ్ రోడ్‌లో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కె. శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ సంస్థ కార్యాలయం ఆవరణలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ శిబిరం జరుగుతుందన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గురు పౌర్ణమి పూజలు

భీమునిపట్నం, జూలై 20 : గురుపూర్ణిమ పురస్కరించుకుని షిర్డీసాయి మందిరంలో బాబాకు ఆదివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్టు షిర్డీసాయి సేవా సమితి అధ్యక్షుడు పట్నాయకుని ఉమామహేశ్వరరావు తెలిపారు. ఉదయం 8 నుంచి బాబాకు సహస్ర నారికేళ సహిత సహస్ర నామార్చనలు జరుగుతాయని చెప్పారు.

ఎండాడ సాయిబాబా ఆలయంలో..

ఎండాడ :జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఉన్న కోదండ రామాలయం, వినాయక, పశుపతినాథేశ్వర, సాయిబాబా ఆలయాల ఆవరణలో గురుపౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు అర్చకుడు సుసరప రామకృష్ణ శర్మ తెలిపారు. అలానే కైలాసగిరి కూడలిలో ఉన్న సద్గురుసాయిబాబా ఆలయంలోనూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని కమిటీ సభ్యుడు రుద్రరాజు రమేష్ చెప్పారు. విశాలాక్షినగర్‌లో ఉన్న కోదండ రామాలయ సముదాయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు గురుస్వామి నాగరాజు తెలిపారు.

హత్యా రాజకీయాలకు వైసీపీ కేరాఫ్ అడ్రస్ : గంటా నూకరాజు

భీమునిపట్నం, జూలై 20 : హత్యా రాజకీయాలకు వైసీపీ కేరాఫ్ అడ్రస్ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అని తేడా లేకుండా అన్నివర్గాలపైనా దాడులు జరగడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గతాన్ని మరిచి మాజీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రపతి పాలన కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

విమ్స్‌లో నర్సు భర్త వీరంగం

ఆరిలోవ, జూలై 20 : విమ్స్‌లో నర్సింగ్ విభాగం ఇన్‌చార్జి భర్త శనివారం వీరంగం సృష్టించాడు. ఈసీజీ నిమిత్తం ఒక మహిళ ఆ గదిలోకి వెళ్లింది. ఆ సమయంలో నర్సు భర్త ఈసీజీ గది డోరు గట్టిగా కొట్టి హడావిడి చేశాడు. అడ్డుకున్న సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం ప్రదర్శించారు. ఒక స్టాఫ్ నర్సు భర్త అయిన తాను తలుపు కొడితే ఎందుకు తీయరంటూ అక్కడ ఉన్న వారిని నానా దుర్భాలాడాడు. కాగా ఈవిషయం తెలుసుకున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు అక్కడికి వెళ్లి నర్సు భర్తను హెచ్చరించారు. మరోసారి ఇటువంటి పనులకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

గంటా దృష్టికి క్షయ నివారణ విభాగం ఉద్యోగుల సమస్యలు

మధురవాడ, జూలై 20 : జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ నివారణ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు తమ సమస్యలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఈమేరకు వారు మధురవాడలో ఒక కార్యక్రమానికి హాజరైన గంటాను శనివారం కలిశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్‌టీఈపీలో 30 మంది పని చేస్తున్నామని, తమను రెగ్యులర్ చేయడంతో పాటు ప్రతి నెల 1న వేతనాలు చెల్లించేలా చూడాలని కోరారు.

టమాటా విక్రయాల కౌంటర్ పరిశీలన

ఎంవీపీ కాలనీ, జూలై 20 : రైతు బజారులో ఏర్పాటు చేసిన టమాటా, కంది పప్పు విక్రయ కేంద్రాలను జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ శనివారం పరిశీలించారు. వినియోగదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాగా టమాటాలు ఎక్కువగా పాడవ్వడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

సినిమా గైడ్

● **డార్లింగ్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీ నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మి (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి)
● **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ),
● **క్రైం రీల్ :** శ్రీకాంతి, సౌజన్య (గోపాలపట్నం),
● **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36,టమాటా 56, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 16, పచ్చిమిర్చి 62, కాకరకాయలు 40, బీరకాయలు 24, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజ్ 34, క్యారేట్ 30, దొండకాయలు 28, బంగాళా దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 145, బరబటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 42, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 38, కీరదోస 28, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 36, కంద 62, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..



ఎంవీపీ కాలనీలో జన సందోహం



కైలాసగిరి కూడలిలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు



రథం ముందు నృత్య ప్రదర్శన

పోటెత్తిన భక్తులు

- గిరి ప్రదక్షిణకు తరలివచ్చిన జనం
- కిక్కిరిసిన రహదారులు
- మార్మోగిన గోవింద నామ స్మరణ

ఎంవీపీ కాలనీ / వెంకోజీపాలెం / విశాలాక్షి నగర్/ఆరిలోవ, జూలై 20 : ఎక్కడ చూసినా జనం.. ఏ నోట విన్నా.. గోవింద నామం.. అప్పన్న గిరి ప్రదక్షిణకు లక్ష లాది మంది భక్తులు తరలిరావడంతో దారులన్నీ కిక్కిరిసిపోయాయి. పరిసరాలు హరి నామ స్మరణతో మార్మోగాయి. చిన్నారులు, వృద్ధులు, యువత, మహి ళలు ఇలా అన్ని వర్గాల వారు స్వామి కృప కోసం తర లివచ్చారు. అప్పుఘర్ వద్ద భారీ జన సందోహం వల్ల వారికి సేవలందించడానికి అధికార యంత్రాంగం, ఇటు స్వచ్ఛంద సంస్థల శక్తి సరిపోలేదు. మధ్యాహ్నం వరకూ ఓ మోస్తరుగా ఉన్న జనం,సాయంత్రం నుంచి ఇసుక వేస్తే రాలనంతగా వచ్చారు. ఒక దశలో భక్తు లను అదుపు చేయడం అధికారులకు కష్టమైంది. సముద్ర తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది నిరంతరం భక్తులను హెచ్చరించారు. పలుచోట్ల జరిగిన సేవా కార్యక్రమాల్లో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం పాల్గొన్నారు. ఇక సందట్లో సడేమియా అన్నట్టు కొందరు చిరు వ్యాపారులు తమ వ్యాపారాన్ని బాగా చేసుకున్నారు. ఎన్ని సంస్థలు ఆహారాన్ని అందించినా, కొన్నిచోట్ల బజ్జీలు, హాట్‌చాట్, పానీపూరి వంటివి భారీగా అమ్మకాలు సాగాయి.

స్వచ్ఛంద సంస్థల సేవలు అమోఘం

స్వచ్ఛంద సంస్థల సేవలు అమోఘమని చెప్పాలి. ఎంవీపీ కాలనీలో విజయలక్ష్మి గిఫ్ట్ స్టోర్స్, జిల్లా కళింగ కోమటి యూత్ అసోసియేషన్, విజయసాయి యోగా ఛారిటబుల్ ట్రస్టు,ఎంవీపీ హెల్పింగ్ హ్యాండ్స్, ఎస్ వాకర్స్ అసోసియేషన్, విశాఖ శాటిలైట్ వాకర్స్ అసోసియేషన్, ఎస్‌బీఐ పింఛనర్ల సంఘం భక్తులు ప్రసాదాలు, బిస్కెట్లు, టీ, పులిహోర పంపిణీ చేశారు. కొత్త వెంకోజీపాలెంలో గ్రామ సేవా సంఘం, సద్గురు సాయినాథ్ వెల్ఫేర్ అసోసియేషన్, కిరణ్మయి మహిళా మండలి ఆధ్వర్యంలో అప్పన్న ప్రతిమ ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందజేశారు. పాత వెంకోజీపాలెంలో సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో బిర్యానీ, అంబలి, స్వీట్ కార్న్ పంపిణీ చేయగా, స్టీల్ ప్లాంటు ఉద్యోగుల సంఘం ఎంఎంటీసీ కాలనీలో టీ,పాలు అందజేశారు. సీఎంఆర్ ఆధ్వర్యంలో ఎంఎంటీసీ త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అప్పన్న ప్రతిమ ఏర్పాటు చేసి, ప్రసాద వితరణ చేపట్టారు. 9వ వార్డు టీడీపీ నాయకుడు వేజెళ్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రసాద పంపిణీలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు ప్రతాప రుద్ర, టీడీపీ నాయకుడు అక్కరమాని వెంకట్రావు పాల్గొని ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భగత్‌సింగ్, వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, వెంపాడ శ్రీనివాసరెడ్డి,మైలపల్లి శ్రీనివాసరావు,వెంకట్రావు పాల్గొన్నారు. కైలాసగిరి కూడలి సాయిబాబా ఆలయం ఆవరణలో జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు, కేవీఆర్ కేటరింగ్స్ అధినేత గరే గురునాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రసాద వితరణలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మేనల్లుడు చిక్కాల విజయ్‌బాబు పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బీవీఆర్ నాయుడు, తెలుగు యువత పాల్గొన్నారు.ఎంవీపీ కాలనీలో గీతం ఆస్పత్రి వైద్యులు సేవలు అందించారు.

కలెక్టర్ పర్యవేక్షణ

కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ అప్పుఘర్ వద్ద భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాలు శుభ్రంగా ఉంచేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్కడున్న శ్రీకాకుళం జిల్లా ఎస్.పి. మహేశ్వరరెడ్డితో పరిస్థితిని సమీక్షించారు.పోలీసులు ఎన్ని ఏర్పాట్లు చేసినా, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం తప్పలేదు. తమ పని ముగించుకుని ఇంటికి వెళ్లడానికి నగరం నుంచి వాహనాల్లో బయలుదేరిన వారికి నరకం కనిపించింది. ఆరిలోవలోని కేంద్ర కారాగారం సమీపంలో ఉన్న రామకృష్ణాపురం జంక్షన్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయిన విషయం తెలుసుకున్న సీపీ శంఖబ్రత బాగ్చీ, సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. భక్తులు సింహాచలం దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత బస్సులు, ఆర్టీసీ బస్సుల్లో వెళ్లాలని ఆయన సూచించారు.



నూతన బస్సుకు పూజ చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు

సింహాచలం : గిరి ప్రదక్షిణలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కుటుంబ సభ్యులతో సహా పాల్గొన్నారు. సింహగిరి రెండవ ఘాట్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన నమూనా ఆలయంలో ఆయన స్వామివారిని దర్శించుకుని కొబ్బరికాయ కొట్టారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు గంటా కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, 98వ వార్డు కార్పొరేటర్ పీవి నరసింహం ఉన్నారు. కాగా భక్తుల ప్రయాణ సౌకర్యార్థం కొనుగోలు చేసిన నూతన ఎలక్ట్రిక్ బస్సును దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన బస్సులో ఈఓ శ్రీనివాసమూర్తి, అధికారులతో కలిసి సింహగిరికి చేరుకుని అప్పన్నస్వామిని దర్శించుకున్నారు.

'వందేభారత్'లో ప్రయాణించిన శ్రీభరత్, 'పల్లా'



రైల్లో ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శనివారం రాత్రి విజయవాడ నుంచి విశాఖపట్నానికి వందేభారత్ రైలులో ప్రయాణించారు. శనివారం విజయవాడలో జరిగిన టీడీపీ పార్లమెంటరీ సమావేశంలో పాల్గొన్న అనంతరం వారు విశాఖ వచ్చేందుకు వందేభారత్ రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా రైలులో ప్రయాణికులతో మాట్లాడి 'వందేభారత్'లోని సదుపాయాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు.

భవనం పైనుంచి జారిపడి తాపీమేస్త్రీ మృతి



భవనం పైనుంచి జారి పడి మృతి చెందిన పాపారావు

విశాలాక్షినగర్, జూలై 20 : జీవీఎంసీ 9వ వార్డులోని విశాలాక్షినగర్ వెటర్నరీ కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి జారి పడి తాపీమేస్త్రీ మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. విశాలాక్షినగర్ వెటర్నరీ కాలనీలో భవన నిర్మాణానికి సంబంధించిన సామగ్రిని తాపీ మేస్త్రీ రౌతు పాపారావు (44,) మూడో అంతస్థులోకి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. సామగ్రి లిఫ్ట్ చేసే మెషీన్‌ను మూడో అంతస్థులో అమరుస్తుండగా రెండో ఫ్లోర్‌లో శ్లాబ్ అడ్డంగా రావడంతో దాన్ని సరి చేయడానికి ప్రయత్నిస్తుండగా మెషీన్ ఆకస్మాత్తుగా కిందకు జారిపోయింది. దాంతో పాటు పాపారావు కూడా రెండో అంతస్థు నుంచి కిందకు పడ డంతో మెషీన్ స్టాండ్ ఆయన గొంతుపై పడిపోవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా విజయనగరం జిల్లా మెంటాడ మండలంలోని పోరం గ్రామానికి చెందిన పాపారావు భవన నిర్మాణ కార్మికుడిగా పదేళ్ల నుంచి ఇక్కడ పని చేస్తున్నాడు. ఆయన పదో వార్డు వివేకానందనగర్ ఆరవ లైన్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య గౌరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె హైదరాబాద్‌లో సీఏ కోర్సు చేస్తుండగా, కుమారుడు ఇంటర్ పూర్తి చేశాడు. కుటుంబ పెద్ద మృతితో వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రేపటి నుంచి ఏయూ కళాశాలలపై సమీక్ష



ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావును సత్కరిస్తున్న ఆచార్యులు

వెంకోజీపాలెం, జూలై 20 : ఏయూ క్యాంపస్ కళాశాలలపై ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి. శశిభూషణరావు దృష్టిసారించారు. సోమవారం నుంచి ఆయన కళాశాలల వారీగా బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పరిశోధకులతో సమీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో బోధన, పరిశోధనలను పటిష్టం చేసే దిశగా ఈ సమీక్షలు జరుపుతారు. ముందుగా ఇంజనీరింగ్ కళాశాలతో ప్రారంభించాలని నిర్ణయించారు. కాగా ఉత్తరాంధ్రకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు శనివారం పెద్ద సంఖ్యలో ఏయూకు తరలివచ్చి వీసీకి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన వ్యక్తి వీసీగా నియామకం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఏయూ ఉద్యోగులకు వేతనాలు, పెన్షన్లు తక్షణమే విడుదల చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈమేరకు వీసీని ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వీరబ్రహ్మయ్య, సెంచూరియన్ వర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, ఐఐపీఈ పూర్వ సంచాలకుడు ఆచార్య వీఎస్ఆర్‌కే ప్రసాద్, ఏయూ అనుబంధ కళాశాలల అధ్యాపకులు, కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గొట్టిపాటి రవికుమార్

సిరిపురం, జూలై 20 : వర్షాల ప్రభావంతో కలిగే విద్యుత్ ప్రమాదాలు, విద్యుత్ అంతరాయాల పట్ల అధికా రులు అప్రమత్తంగా వ్యవహరించాలని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. శనివారం ఆయన ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, సంస్థ డైరెక్టర్లు, ఎస్ఈలు, ఈఈలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల వల్ల ఏర్పడిన విద్యుత్ అంతరాయాలను త్వరితగతిన పునఃరుద్ధరించాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని చెప్పారు. వరద ప్రవాహానికి గురైన కుక్కునూరు, వేలేరుపాడు ప్రాంతాల్లో పరిస్థితిపై ఆరా తీశారు. వర్షాల వల్ల తెగిపడిన విద్యుత్ వైర్లు, స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే సరి చేయాలన్నారు. కాగా విద్యుత్ అంతరాయాల ఫిర్యాదులు, సమస్యలను పరిష్క రించేందుకు ఐదు సర్కిళ్లలో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేశామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 1912, వాట్సాప్ నెంబర్ 8500001912, కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు శ్రీకాకుళం 9490612633, విజయనగరం 9490610102, విశాఖపట్నం 7382299975, రాజమండ్రి 738229960, ఏలూరు 9440902926 నంబర్లను సంప్రతించాలని ఆయన సూచించారు.

రావిచెట్టు తొలగించొద్దు

సింహాచలం, జూలై 20 : జీవీఎంసీ 98వ వార్డు పాత అడివివరం కూడలిలో సుమారు వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన రావిచెట్టును టీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ పనుల్లో భాగంగా తొలగించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో తరతరాలుగా ఆ చెట్టు కింద వ్యాపారాలు చేసుకుంటున్న వారు, స్థానికులు అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ఆ చెట్టుకు ఓ బోర్డు వేలాడదీశారు. అందులో చెట్టును తొలగించవద్దని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకున్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

ఎంవీపీ కాలనీ, జూలై 20 : డీఎస్సీకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్న బీసీ స్టడీ సర్కిల్ దరఖాస్తుల గడువును ఈనెల 24 వరకూ పెంచింది. ఈమేరకు స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె. శ్రీదేవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. శిక్షణ పొందిన వారికి రూ. 3 వేలు స్టైఫండ్, రెండు నెలల ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబరు 94925 69177లో సంప్రతించాలని సూచించారు.

ఏయూ పరీక్షల విభాగం డీన్ మూర్తికి సత్కారం

వెంకోజీపాలెం, జూలై 20 : ఏయూ పరీక్షల విభాగాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దానన్న సంతృప్తి ఉందని ఆ విభాగం డీన్‌గా పనిచేసి ఆంధ్ర కేసరి వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ఆచార్య డీవీఆర్ మూర్తి అన్నారు. శనివారం పరీక్షల విభాగంలో పలువురు ఆచార్య డీవీఆర్ మూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరి సహకారంతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించానని చెప్పారు. పరీక్షల విభాగంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సెంటర్ సంచాలకుడు ఆచార్య భాస్కరరెడ్డి, సీఈటీ చిట్టిబాబు, డీఆర్‌జే. రత్నం, పద్మరాజు, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మూర్తిని ఆర్ట్స్ కళాశాల ఆచార్యులు కూడా సత్కరించారు.



ఎంవీపీలోని ఈస్ట్‌పాయింట్ కాలనీలో ఉన్న సాయిబాబా ఆలయంలో ఆదివారం జరిగే గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిర్వాహకులు ఆలయాన్ని పలు పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు.

\- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా

రోగులకు మెరుగైన సేవలు

కొమ్మాది, జూలై 20 : గాయత్రి విద్యా పరిషత్ ఆస్పత్రి రోగులకు మెరుగైన సేవలు అందిస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం గాయత్రి విద్యా పరిషత్ ఆస్పత్రి, మిషన్ స్మైల్, ముత్తూట్ పిన్‌కార్ప్ సంయుక్తంగా నిర్వహించిన గ్రహణ మొర్రి ఉచిత శస్త్ర చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాయత్రి ఆస్పత్రి సేవలను కొనియాడారు. ఆస్పత్రి యాజమాన్యం మిషన్ స్మైల్ పేరుతో ఉచితంగా గ్రహణం మొర్రి శస్త్ర చికిత్సలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ డైరెక్టర్, మెడికల్ సూపరింటెండెంట్ ఆచార్య కె.సత్యవరప్రసాద్, గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, బోర్డు ఆఫ్ మిషన్ స్మైల్ ట్రస్టీ డాక్టర్ రామ్‌కుమార్, ముత్తూట్ పాపాచాన్ గ్రూప్ సీఎస్ఆర్ హెడ్ డాక్టర్ ఎన్. ప్రశాంత్‌కుమార్, పాల్గొన్నారు.

పాడి పశువుల ఆరోగ్య సంరక్షణకు చర్యలు


భీమునిపట్నం (రూరల్), జూలై 20 : జిల్లాలో పాడి పశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పశు సంవర్ధక శాఖ జిల్లా ఉప సంచాలకుడు డా. ఎన్. చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన రేఖవానిపాలెం గ్రామంలో పశువుల పెంపకం పట్ల రైతులకు అవగాహన కల్పించారు.

'పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

ఆనందపురం, జూలై 20 : మండలంలో రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. శనివారం వారు పలు గ్రామాల్లో పర్యటించి, వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలకు నువ్వులు, మిరప, చిక్కుడు, కూరగాయలు పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్టు తెలిపారు. అధికారులు పంట నష్టాలను అంచనా వేసి, రైతులను ఆదుకోవాలని కోరారు.

మిథిలాపురి వుడా కాలనీలో అంధకారం

మధురవాడ, జూలై 20 : జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి వుడాకాలనీ ప్రాంతంలో పలుచోట్ల వీధి లైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వుడాకాలనీ నుంచి వాంబేకాలనీకి వెళ్లే రహదారి, కాలనీలోని కుషి షాపింగ్ మాల్ నుంచి ఆర్టీసీ డిపోకు వెళ్లే దారి, మొగదారమ్మ ఆలయం నుంచి హైవీల్ పాఠశాలకు వెళ్లే మార్గంలో గత పది రోజులు నుంచి వీధి లైట్లు వెలగడం లేదని స్థానికులు తెలిపారు. లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో బస్సులు దిగి వెళ్లేవారితో పాటు వివిధ పనులపై బయటకు వెళ్లి సాయంత్రం ఇళ్లకు చేరుకునేవారు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా చీకట్లో రాకపోకలకు మహిళలు, చిన్నారులు, వృద్ధులు భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో దొంగల భయం ఉండడంతో నడచి వెళుతున్న వారిని కొందరు అడ్డగించి డబ్బులు, సెల్‌ఫోన్లు లాక్కుంటున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



మొగధారమ్మ ఆలయం సమీపంలో దుస్థితి



వాంబేకాలనీకి వెళ్లే రహదారిలో వెలగని లైట్లు